


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


జైలు నుంచి విడుదలైన పాస్టర్ అభినయ్ దర్శన్




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 143 | శుక్రవారం 29 - 05 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


## అంతర్రాష్ట్ర జలవివాదాలు..

**కెన్-బెట్వా ప్రాజెక్టును ఉదహరించిన ప్రధాని మోదీ**



జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని సూచన

సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా సమస్యలను అధిగమించాలన్న మోదీ

ఆయా రాష్ట్రాల్లోని రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు



మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి జారీ

జూన్ 2 నుంచి పంపిణీకి ఆర్టీసీ కసరత్తు

ఇక ఆధార్ కార్డు అవసరం ఉండదు

దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం

తొలుత ప్రయోగాత్మకంగా ప్రతీ జిల్లాలో ఒక మండలంలో జారీ

కార్డుల కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో కేంద్రాల సమాచారం

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...

**కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు**



- అమీర్‌పేట మైత్రివనం వద్ద విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, నందమూరి కుటుంబ సభ్యులు, మంచు మనోజ్
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్న రేవంత్ రెడ్డి

## మమతా బెనర్జీకి మరో భారీ షాక్..

**అధికార ప్రతినిధి శంతను సేన్ రాజీనామా**

కకోలి దస్తీదార్ రాజీనామా చేసిన మరుసటి రోజే షాకిచ్చిన శంతను

ఆర్జీకర్ హత్యాచార కేసు, అవినీతి ఆరోపణలతో మనస్తాపం చెందినట్లు వెల్లడి



## మహారాష్ట్రలో హత్యకు గురైందనుకున్న యువతి...

**మధ్యప్రదేశ్ లో ప్రత్యక్షం!**



## అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ:

టీడీపీ మహానాడులో అనిత ప్రసంగం

ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు

చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్న అనిత

20 ఏళ్లు టీడీపీ అధికారంలో ఉంటే ఏపీ ప్రపంచంలోనే నెంబర్ వన్



## క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి



మహానాడు-2026లో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి

ఎన్టీఆర్ ఆత్మగౌరవం, చంద్రబాబు ఆత్మవిశ్వాసం, లోకేష్ మనోధైర్యం పెంచారన్న రామ్మోహన్

రాష్ట్రానికి సుస్థిర పాలన అందించడం టీడీపీ బాధ్యత అని స్పష్టీకరణ

మూడు తరాలుగా టీడీపీ మహిళలకు ప్రాధాన్యత ఇస్తే, ప్రతిపక్షం కత్తుల సంస్కృతిని ప్రోత్సహించిందని విమర్శ

# జగన్ అధికారం అండతో పీఏ దోపిడీ పర్వం

పది వేల జీతం నుంచి కేఎన్ఆర్ వందల కోట్లకు

కబ్జాలు, వసూళ్లు, సెటిల్మెంట్ల జోరు

ఎన్ఆర్ఐని బెదిరించి కృష్ణాలో 40 ఎకరాలు స్వాహా

తిరుపతిలో హాథీరామ్ జీ మఠం భూముల కబ్జా

బెజవాడలో కార్ల షోరూమ్‌లో వాటా.. సెటిల్మెంటే

కేఎన్ఆర్ ఇల్లు, కార్ల షోరూమ్‌లో పోలీసుల తనిఖీ


వైసీపీ అధికార ప్రతినిధి శివశంకర్ రెడ్డికి నోటీసు

కేఎన్ఆర్‌కు బినామీ అని సిట్‌కు ఆధారాలు



కేవలం పది వేల రూపాయల జీతం తీసుకునే వ్యక్తి జీవిత కాలంలో చిన్న ఇల్లు కట్టడం అసాధ్యం.. సెంటు భూమి కొనాలన్నా కూడా కష్టమే. కానీ వైఎస్ జగన్ వ్యక్తిగత సహాయకుడు కె.నాగేశ్వర రెడ్డి(కేఎన్ఆర్) మాత్రం వందల కోట్ల ఆస్తులు సంపాదించారు. ఒకప్పుడు ప్రైవేటు ఉద్యోగిగా పదివేల రూపాయల జీతంతో పనిచేసిన ఆయన జగన్ వద్ద పీఏగా చేరాక అక్రమార్జనకు అంతూ పొంతూ లేకుండా పోయింది. జగన్ అధికారమే వరంగా కేఎన్ఆర్ లక్షలతో మొదలు పెట్టి కోట్లు వసూలు చేశారు. మూడు రాష్ట్రాల్లో భారీగా ఆస్తులు సంపాదించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం స్కామ్‌లో నిందితుడైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో ఆయన నెరిపిన వ్యవహారంపై సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఆయన ఆస్తుల చిట్టా చూసి అవాక్కవుతున్నారు. మంత్రిగా పనిచేసిన నాయకుడి కన్నా ఎక్కువే ఆస్తులు ఉన్నాయంటూ ఆయన బాధితులే పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో సిట్ బృందాలు గురువారం బెజవాడలో మాచవరం వెటర్నరీ కాలనీలో ఉన్న కేఎన్ఆర్ ఇంట్లో సోదాలు చేశారు. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కేఎన్ఆర్‌కు వైసీపీ అధికార ప్రతినిధి శివశంకర్ రెడ్డి బినామీగా ఉన్నట్టు సిట్ అధికారులకు ఆధారాలు లభించాయి. దీంతో తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయానికి సమీపంలోని శివశంకర్ రెడ్డి నివాసానికి వెళ్లి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. అలాగే కేఎన్ఆర్ సెటిల్మెంట్ ద్వారా భాగస్వామ్యం దక్కించుకున్నట్లు ఆరోపణలున్న కార్ల షోరూమ్‌లో సిట్ అధికారులు సోదాలు చేపట్టారు. విజయవాడలో రామవరప్పాడులోని లక్కీ హ్యుందాయ్ షోరూమ్‌లో తనిఖీలు చేసి..

## లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తున్నాం: 'మహానాడు'లో చంద్రబాబు



"జై కార్యకర్త" నినాదంతో ముగిసిన టీడీపీ మహానాడు.. 24.5 లక్షల మంది హాజరు

గొడ్డలి పార్టీకి గంజాయి, బ్లేడ్, పేటీఎం బ్యాచ్‌లు ఉన్నాయంటూ చంద్రబాబు తీవ్ర ఆరోపణలు

గతంలో పరదాల పాలన, ఇప్పుడు ప్రజల మధ్య పాలన సాగిస్తున్నామని వెల్లడి

పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చారిత్రక ప్రకటన

"జై కార్యకర్త... జై జై కార్యకర్త" అంటూ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపుతూ, భవిష్యత్ రాజకీయాలకు, ప్రభుత్వ పాలనకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మహానాడు ముగింపు వేదికపై నుండి ఉద్విగ్న ప్రసంగం చేశారు. రెండు రోజుల పాటు డిజిటల్ వేదికగా అత్యంత వైభవంగా జరిగిన ఈ మహానాడులో కార్యకర్తే అధినేత అనే స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, 2029 ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తూ పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చంద్రబాబు చారిత్రక ప్రకటన చేశారు. బీసీలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తామని ఉద్ఘాటించారు. ఈ వర్చువల్ మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల నుండి, 12 దేశాల నుండి ఏకంగా 24.5 లక్షల మంది హాజరుకావడం ఒక చరిత్ర అని, రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం టీడీపీకే సాధ్యమని చంద్రబాబు అన్నారు.

# జగన్ అధికారం అండతో పీఏ దోపిడీ పర్వం

శుక్రవారం విచారణకు రావాలని పార్ట్నర్ ఉస్మాన్ సందీపకు నోటీసులు ఇచ్చారు. ఇద్దరి మధ్య డబ్బు వ్యవహారంపై విచారించి కీలక వివరాలు రాబట్టనున్నట్టు తెలుస్తోంది.

**జగన్ పాలనలో సెటిల్మెంట్లు** 2019లో జగన్ సీఎం అయ్యాక 2024 వరకూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేఎన్ఆర్ సెటిల్మెంట్లు చేశారు. వందల కోట్ల ఆస్తులు, విశాఖపట్నం విమానాశ్రయం నుంచి తిరుపతి ఎయిర్పోర్ట్ వరకూ ఎకరాలకు ఎకరాల భూములు సెటిల్మెంట్ల ద్వారా సంపాదించినట్లు సిట్కు ఆధారాలు లభించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... తిరుమల కొండకింద హథీరామ్ జీ మఠం భూములను అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి కబ్జా చేశారు. కొన్ని భూముల్ని అర్జున్ దాస్ అనే వ్యక్తి విక్రయించగా, అతన్ని బెదిరించి వైసీపీ నేతలు ఎకరాలకు ఎకరాలు కొట్టేశారు. జగన్ సొంత పత్రికలో కీలక స్థానంలో ఉన్న వ్యక్తి సైతం రెండెకరాలు కొట్టేసి వైద్యురాలైన భార్యకు ఆసుపత్రి నిర్మించే ప్రయత్నాలు చేశారు. అయితే 2024 ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో నిర్మాణం సాధ్యం గాక ఆపేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్కు ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ జగన్ పీఏ రూ.5 కోట్లు తీసుకుని తిరుపతిలో స్థిరాస్తి కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లోనూ పలువురు ఆశావహులతో టికెట్లు ఇప్పిస్తానని పెద్దఎత్తున వసూలు చేశారు. అప్పటికే పదవిలో ఉన్న వారిని మీపై ఏజెన్సీ, ఇంటెలిజెన్స్ నెగిటివ్ నివేదిక ఇచ్చిందని, సీఎంకు పంపకుండా ఉండాలంటే ముడుపులు ఇవ్వాలని కోట్ల రూపాయలు వసూలు చేశారు. ప్రకాశం జిల్లా దర్శి వద్ద భూ పంచాయతీ చేసి పదెకరాలు దక్కించుకున్నారు. కృష్ణా జిల్లా సరిహద్దుల్లో రాజధాని అమరావతికి అనుకూలంగా ఉండే చోట కేఎన్ఆర్ ఏకంగా 40 ఎకరాలను అతి తక్కువ ధరకు కొట్టేసినట్లు పోలీసు ఉన్నతాధికారులకు వైసీపీనేతలే ఆధారాలు పంపించినట్లు తెలిసింది. అమెరికాలో ఉన్న ఎన్ఆర్ఐలకు సంబంధించిన భూమిని సమీప బంధువులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అప్పటి సీఎం జగన్కు బాధితులు లేఖ రాశారు. దీన్ని ముందుగా చూసిన కేఎన్ఆర్ ఆ వివాదంలోకి తలదూర్చి సెటిల్మెంట్ చేశారు. రూపాయి విలువైన భూమికి పది పైసలు ఇచ్చి బలవంతంగా రిజిస్టర్ చేయించుకున్నట్లు సమాచారం. విశాఖ విమానాశ్రయం సమీపంలో ప్రభుత్వ భూములు, ప్రైవేటు వ్యక్తుల ఆస్తులు భారీగానే పోగేసుకున్న కేఎన్ఆర్కు.. గతప్రభుత్వంలో ఉన్నతస్థానంలోని ఐఏఎస్ సహకరించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్, బెంగళూరులోనూ ఇళ్లు ఉన్నాయి.

**త్వరలో ఈడీ రంగంలోకి..** భార్య కోసం కేఎన్ఆర్ తీసుకున్న బంగారు బహుమతులు రెండున్నర కిలోలు ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. బామ్మర్ది భాగస్వామ్యంతో సాఫ్ట్వేర్ కంపెనీ ఏర్పాటు చేయడంపై ఆరా తీస్తున్నారు. కేఎన్ఆర్ భార్య ఖాతాలోకి లక్షలకు లక్షలు వరదలా జమై రూ.19.85 కోట్లకు చేరిన లావాదేవీలపైనా దృష్టిపెట్టారు. బుధవారం నాడు విచారణలో అన్నింటికీ ఆడిటర్ పేరు చెప్పిన కేఎన్ఆర్.. గురువారం పలు అక్రమ లావాదేవీలు జరిగినట్టు అంగీకరించినట్లు సమాచారం. రూ.వందల కోట్ల ఆస్తుల వివరాలు సిట్ ఆయన ముందుంచడంతో.. అవన్నీ లిక్కర్ ముడుపుల నుంచి కొనుగోలుచేసినవి కాదంటూ అసలు గుట్టు బయట పెట్టినట్లు తెలిసింది. ఈ వివరాలన్నీ ఇప్పటికే సిట్ అధికారుల నుంచి తీసుకున్న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ త్వరలో జగన్ పీఏను ప్రశ్నించి ఉచ్చు బిగించే అవకాశముంది.

**కార్ల షోరూమ్లో వాటా కథ ఇదీ..** విజయవాడలో రామవరప్పాడులోని లక్కీ హ్యుందాయ్ కార్ల షోరూమ్లో దౌర్జన్యంగా కేఎన్ఆర్ వాటా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ షోరూమ్ నుంచి కొన్ని కార్లను ఆర్టీఏ అనుమతి లేకుండా విక్రయించడం, కొందరి దగ్గర డబ్బులు తీసుకుని వాహనాలు ఇవ్వకపోవడంపై రవాణా శాఖకు గత వైసీపీ ప్రభుత్వంలో ఫిర్యాదులు అందాయి. అప్పట్లో అధికారులు గట్టిగా వ్యవహరించడంతో కార్ల షోరూమ్ యజమాని విజయవాడకు చెందిన ఒక యువ నాయకుడి సహకారం కోరినట్లు తెలిసింది. దీంతో ఆ యువ నేత కార్ల షోరూమ్ యజమాని సమస్య పరిష్కరించాలని కేఎన్ఆర్ను కోరారు. దీంతో సమస్య పరిష్కరిస్తానంటూ కేఎన్ఆర్ 51శాతం వాటా లాక్కున్నట్లు తెలుస్తోంది. అందుకుగానూ రూ.2 కోట్లు చెల్లించినట్లు చూపిన జగన్ పీఏ ఆ సొమ్ముకూడా ఇవ్వలేదని సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కార్ల షోరూమ్ యజమాని ఎదురు తిరగగా, స్థానిక నేతలతో బెదిరించినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

**టికెట్లు ఇప్పిస్తానని వసూళ్లు** వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో కేఎన్ఆర్ రూ.వందల కోట్ల ఆస్తులు పోగేశారు. దీనిపై పోలీసులు ఆరా తీయగా.. ఆయన దందాలు, వసూళ్లు వెలుగుచూశాయి. అధికారంలోకి రాకముందు జగన్ పాదయాత్ర చేపడితే, కేఎన్ఆర్ వసూళ్లు మొదలుపెట్టారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తలతో రెండు, మూడు లక్షల రూపాయలు తీసుకుని జగన్తో ఫొటోలు తీయించే స్థాయి నుంచి 2019లో నాలుగైదు కోట్లు తీసుకుని ఎమ్మెల్యేగా పోటీ చేసేవారికి ఎన్నికల బీ ఫారాలు ఇప్పించే స్థాయికి ఎదిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో ఎమ్మెల్యేగా ఉన్న ఒక బీసీ నాయకుడు టికెట్ కోసం కేఎన్ఆర్ కోట్లాది రూపాయలు తీసుకున్నాడంటూ ముఖ్యమంత్రి అయ్యాక జగన్కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఉభయ గోదావరి జిల్లాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆశావహుల నుంచీ ఆయన భారీగా వసూలు చేశారు. తన దగ్గరికి రాని వారిని మీపై నివేదికలు వ్యతిరేకంగా వచ్చాయంటూ బెదిరించి వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది.

# లోకేష్ ప్రతిపాదనను ఆమోదిస్తున్నాం: ‘మహానాడు‘లో చంద్రబాబు

**కార్యకర్తే పార్టీకి బలం, భవిష్యత్తు** ప్రసంగం ఆద్యంతం చంద్రబాబు కార్యకర్తల త్యాగాలను, సేవలను స్మరించుకున్నారు. “శాశ్వతంగా పార్టీని మోసింది, మోసేది, మోయబోయేది కార్యకర్తలే. వారందరికీ నా పాదాభివందనం. నాపై కార్యకర్తలు, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తాను“ అని ఆయన భావోద్వేగంతో ప్రసంగించారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశామని, వారి పిల్లల విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. “ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ మా లక్ష్యం. నీతి నిజాయితీగా కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా నేను బాధ్యత తీసుకుంటాను“ అని భరోసా ఇచ్చారు. మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిన కార్యకర్తలే తనకు శిరోధార్యమని చెబుతూ, వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

**గొడ్డలి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు** ప్రతిపక్షంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “గొడ్డలి పార్టీకి అధికారం పోయింది, ప్రతిపక్ష హోదా పోయింది, అయినా అహంకారం మాత్రం పోలేదు. కుట్రలు, కుతంత్రాలు మానడం లేదు“ అని దుయ్యబట్టారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకైనా యువత, రైతులు, మహిళలు వంటి విభాగాలుంటే, గొడ్డలి పార్టీకి మాత్రం గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, సోషల్ మీడియా సైకోల బ్యాచ్, ఫేక్ ప్రచారాల పేటీఎం బ్యాచ్, హత్యా రాజకీయాల కిరాయి హంతక బ్యాచ్, దేవాలయాలపై దాడి చేసే బ్యాచ్, కల్తీ లిక్కర్ బ్యాచ్ వంటి ఏడు విధ్వంసక విభాగాలున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని, అదే సమయంలో నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిత్వానికి మరక అంటకుండా జాగ్రత్తపడాలని హితవు పలికారు. “డబ్బు పోతే సంపాదించుకోగలం, క్యారెక్టర్ పోతే కోలుకోలేం“ అని ఆయన నొక్కి చెప్పారు. “గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్“ అనేదే మన నినాదం కావాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**ప్రజా పాలనే మా నమూనా** గత పాలనను “పరదాల పాలన“గా అభివర్ణిస్తూ, తమది ప్రజల మధ్య ఉండే ప్రభుత్వమని చంద్రబాబు స్పష్టం చేశారు. “గత ప్రభుత్వ నిర్వాకంతో అన్ని వ్యవస్థలూ విధ్వంసం అయ్యాయి. వెంటిలేటర్పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చాం. రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని రీషెడ్యూల్ చేస్తున్నాం“ అని తెలిపారు. “సీఎం అంటే కామన్ మ్యాన్“ అనేలా తన పాలన ఉంటుందని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పథకాలు అందుతున్నాయో లేదో స్వయంగా తనిఖీ చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయని, కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని సంతోషం వ్యక్తం చేశారు. కేవలం 36 రోజుల్లోనే 5వ తరం ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు ఏపీకి రావడం “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్“కు నిదర్శనమని అన్నారు.

**సంపద సృష్టి - సర్వతోముఖాభివృద్ధి**సంపద సృష్టించి, దానిని ప్రజలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. “ఆదాయం లేకుండా అప్పులు చేసి సంక్షేమం చేయడం కాదు, సంపద సృష్టించి సంక్షేమం అందించడమే టీడీపీ లక్ష్యం“ అని స్పష్టం చేశారు. ఒకటో తేదీనే పెన్షన్, మహిళలకు స్త్రీశక్తి, తల్లికి వందనం వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రూ.40 వేల కోట్లతో ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గోదావరి-కావేరి అనుసంధానంతో పాటు, గోదావరి నీటిని నల్లమల సాగర్కు తరలించే ఆలోచన చేస్తున్నామన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, భవిష్యత్తులో యూనిట్కు రూ.1.20 మేర తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. అక్రమ పత్రికలు మెగా డీఎస్సీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, యువతలో అశాంతి సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

**భవిష్యత్ తరాలకు భరోసా** ఈ మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించిన చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ ప్రతిపాదన మేరకు పార్టీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చారిత్రక ప్రకటన చేశారు. యువత భవిష్యత్తు కోసమే ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి నూతన టెక్నాలజీలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని చెప్పారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర పురోభివృద్ధికి టెక్నాలజీ ఎంత అవసరమో, మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత కూడా అంతే అవసరమని, ఈ రెండింటి కలయికతోనే “ఆనందాంధ్రప్రదేశ్“ సాధ్యమవుతుందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. మహానాడును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## క్షేత్రస్థాయిలో పోరాడినట్టే సోషల్ మీడియాలోనూ పోరాడాలి: ‘మహానాడు‘లో రామ్మోహన్ నాయుడు

క్షేత్రస్థాయిలో పార్టీ కోసం ఎంతగా శ్రమిస్తున్నామో, అదే స్థాయిలో సోషల్ మీడియాలో కూడా కష్టపడాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పోరాటంతో పాటు, ఆన్లైన్లో కూడా పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. గురువారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు-2026 రెండో రోజు కార్యక్రమంలో ఆయన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టి, సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, 1982లో ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించి దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారని గుర్తుచేశారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే కాంగ్రెస్ను గద్దె దించి అధికారంలోకి వచ్చిన ఘనత టీడీపీదని అన్నారు. “సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు“ అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని చంద్రబాబు తన పాలనలో నిజం చేసి చూపిస్తున్నారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి, యువతను ప్రోత్సహించిన పార్టీ టీడీపీ అని తెలిపారు. పార్టీ మూడు తరాల నాయకత్వం గురించి ఆయన ఆసక్తికరంగా వివరించారు. ఎన్టీఆర్ తెలుగువారికి ఆత్మగౌరవాన్ని నేర్పితే, చంద్రబాబు “విజన్“ అనే పదానికి అర్థం చెప్పి రాష్ట్రానికి ఆత్మవిశ్వాసాన్ని పెంచారని అన్నారు. ఇక నారా లోకేష్, “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్“ నుంచి “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్“ స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లి కేవలం రెండేళ్లలో రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం అయితే, చంద్రబాబు ఆత్మవిశ్వాసం పెంచారని, ఇప్పుడు లోకేష్ మనో ధైర్యాన్ని నింపుతున్నారని అభివర్ణించారు. తమ పార్టీ మూడు తరాలుగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, డ్వాక్రా సంఘాలు, 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి ఉన్నతికి పాటుపడితే, ప్రతిపక్ష పార్టీ మాత్రం మూడు తరాలుగా వేట కొడవళ్లు, కత్తులు, గొడ్డళ్ల సంస్కృతిని ప్రోత్సహించిందని ఆయన విమర్శించారు. గత 44 ఏళ్లుగా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని టీడీపీ నిలబడిందని, ఈసారి రాజకీయ తీర్మానంలో “సంకల్పం, కర్తవ్యం“ అనే రెండు అంశాలు కీలకమని అన్నారు. రాష్ట్రానికి సుస్థిరమైన పరిపాలన అందించాల్సిన బాధ్యత, కర్తవ్యం తెలుగుదేశం పార్టీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మహత్తర కార్యక్రమానికి తరలివచ్చిన 15 లక్షల మంది కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

## మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వ ప్రత్యేకంగా మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల జారీ చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్మిలకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక నుంచి ఆధార్ కార్డుకు బదులు స్మార్ట్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

**జూన్ 2 నుంచి జారీ** స్మార్ట్ కార్డులు వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ప్రతిపాదలను ఆర్థిక శాఖ మంత్రికి ఎం.డి. నాగిరెడ్డి వివరించడం తోపాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి వివరించారు. ఇందుకు ఆమోదం తెలుపడంతో తొలుత జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని, సాంకేతిక సమస్యలు పరిష్కరించుకొని జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై కసరత్తు జరుగుతోంది. స్మార్ట్ కార్డుకు సంబంధించిన విధివిధానాలు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని అధికారులకు ఇంకా అందలేదు. త్వరలో సమాచారం అందే అవ కాశం ఉన్నట్టు చెబుతున్నారు.

**ఏటీఎం తరహాలో కార్డు** ఏటీఎం తరహాలో చిప్తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహాలక్ష్ముల ప్రాథమిక సమాచారం చిప్తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు, ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల పరిధిలో నెలకు సగటున 1.12కోట్ల మంది, ఏడాదికి 13.33 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.

**దుర్వినియోగానికి చెక్** ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయానికి గండి పడుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కార్డుల జారీ దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీఆర్ఎస్ఆర్టీసీ అధికారిక వెబ్సైట్లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

## అంతర్రాష్ట్ర జలవివాదాలు..

అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సూచన చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కెన్-బెట్వా ప్రాజెక్టు నమూనాను ఉదహరించారు. భారతదేశంలో మొట్టమొదటి నదుల అనుసంధాన ప్రాజెక్టు కెన్-బెట్వా ప్రాజెక్టు. మధ్యప్రదేశ్లోని కెన్ నదిలో ఉన్న అదనపు జలాలను కాలువ ద్వారా ఉత్తరప్రదేశ్లోని బెట్వా నదికి మళ్లిస్తారు. ఈ నేపథ్యంలో మోదీ మాట్లాడుతూ, రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ఇది ఆదర్శ మోడల్గా పేర్కొన్నారు. ప్రధాని మోదీ కెన్ - బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం, ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0ను కూడా సమీక్షించారు. ఆయా నగరాల్లో రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలను అన్వేషించాలని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని ప్రధాని మోదీ సూచించారు.

## మమతా బెనర్జీకి మరో భారీ షాక్..

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మమతా బెనర్జీకి వరుస షాక్లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ దస్తీదార్ ఘోష్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామా మరుసటి రోజే శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా తన పాత్రను నిర్వర్తించే స్థితిలో లేనని తెలిపారు. వివిధ సమయాల్లో తాను పార్టీ నిర్ణయాలతో ఏకీభవించలేదని, అనేక వివాదాస్పద అంశాలపై తాను బహిరంగంగానే ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలు తనను వివిధ సందర్భాలలో ఎంతగానో ప్రశంసించారని పేర్కొన్నారు. ఆర్జీకర్ కేసు, నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాల కారణంగా ప్రజలు తమను ఓడించారని, అందుకే అధికార ప్రతినిధిగా మాట్లాడటానికి తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో హత్యకు గురైందనుకున్న యువతి...

మహారాష్ట్రలోని జలగావ్ లో హత్యకు గురైందని భావించిన 26 ఏళ్ల శివాని అనే యువతి, మధ్యప్రదేశ్లో సజీవంగా కనిపించింది. ఆమె హత్య కేసులో అప్పటికే ఆమె తండ్రి, సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ ఉదంతం కలకలం రేపింది. బుర్హాన్పూర్ ఎస్పీ అశుతోష్ బగ్రీ వెల్లడించిన వివరాల ప్రకారం, మే 1న శివాని, మే 9న అరుణ్ అనే యువకుడు కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఖక్నార్ పోలీస్ స్టేషన్లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో, మహారాష్ట్రలోని జలగావ్ పోలీసుల పరిధిలో తలలేని, పాక్షికంగా కాలిపోయిన ఓ యువతి మృతదేహం లభ్యమైంది. అది శివానీదేనని నిర్ధారించిన జలగావ్ పోలీసులు, హత్య కేసు నమోదు చేసి ఆమె తండ్రి బాపురం కల్మేకర్, సోదరుడు అజయ్ కల్మేకర్లను అరెస్ట్ చేశారు. అయితే, అనూహ్యంగా శివాని... అరుణ్తో కలిసి బుర్హాన్పూర్ పోలీసుల ఎదుట హాజరవడంతో ఈ కేసు నాటకీయ మలుపు తిరిగింది. తన తండ్రి, సోదరుడు నిర్దోషులని, వారిని వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేసింది. “ఒకవైపు శివాని హత్య కేసు మహారాష్ట్రలో నమోదైతే, మరోవైపు ఆమె ఇక్కడ సజీవంగా ఉంది. ఇది విరుద్ధమైన పరిస్థితి“ అని ఎస్పీ బగ్రీ వ్యాఖ్యానించారు. మృతదేహానికి డీఎన్ఏ పరీక్ష చేయకుండానే పోలీసులు శివానిదిగా నిర్ధారించి, ఆమె కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ:

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలన విధ్వంసకరంగా సాగిందని, అది ప్రజావేదిక కూల్చివేతతో మొదలైందని ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీని“గొడ్డలి పార్టీ“గా అభివర్ణించిన ఆమె, టీడీపీ రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ అని స్పష్టం చేశారు. మహానాడు రెండో రోజు రాజకీయ తీర్మానాన్ని బలపరుస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి కోసం పోరాడిన మహిళలను బూటుకాళ్లతో తొక్కించారని, నారా లోకేష్ చేపట్టిన ‘యువగళం‘ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని అనిత ధ్వజమెత్తారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని మండలికి పంపిన నీచపు ఘనత ఆ పార్టీదేనని తీవ్రంగా విమర్శించారు. తాము గొడ్డళ్లు చేతికిచ్చే పార్టీ కాదని, యువనేత లోకేష్ రాజ్యాంగబద్ధమైన పాలన అందిస్తారని, ఆయన చేతిలో ఉన్నది ‘రెడ్ బుక్‘ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అనిత అన్నారు. 2014లో నవ్యాంధ్రకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, అమరావతి, పోలవరం పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. రూ.200 ఉన్న పెన్షన్ను రూ.2000కు పెంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. రానున్న 20 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగితే, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేసిన చంద్రబాబుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**గత పాలనలో విధ్వంసమే: సోమిరెడ్డి** తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు సమావేశాలు వాడివేడిగా సాగాయి. మౌలిక సదుపాయాలు, దేవాలయాల పరిరక్షణపై ప్రవేశపెట్టిన తీర్మానాల సందర్భంగా టీడీపీ నేతలు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. మౌలిక సదుపాయాలపై ప్రవేశపెట్టిన తీర్మానంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రంలో కేవలం 1,800 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించారని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 5,050 కిలోమీటర్ల రహదారులను నిర్మించిందని ఆయన పోల్చి చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని రోడ్లలో 50 శాతం దెబ్బతిన్నాయని ఆరోపించారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులు 1,631 రోజుల పాటు ఉద్యమం చేశారని, ఈ పోరాటంలో 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. “మావిగన్“ పేరుతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని, వారి గన్ కల్చర్ ఇంకా పోలేదని విమర్శించారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యేరా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఘనంగా విశ్వవిఖ్యాత నట సార్వభౌమ డా. నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలు



## నంద్యాలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

## తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహానాయకుడు ఎన్టీఆర్: మంత్రి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో మే 28 ( నంది పత్రిక )** తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌ రవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామా రావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు నంద్యాల పట్టణంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నంద్యాల ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక స్టార్ హీరో మాత్రమే కాదని, భారత రాజకీయాల్లోనే వ్యవస్థను మార్చిన ఒక అసలైన "డిస్రప్టర్" (గేమ్ చేంజర్) అని కొనియాడారు. "తెలుగువాడు" అనే గుర్తింపును, పౌరుషాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఆయనని స్మరించుకున్నారు. వెండితెరపై దేవుడిగా పూజలందుకున్న ఎన్టీఆర్, 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 'చైతన్య రథం' ద్వారా సామాన్య ప్రజల చెంతకు వచ్చి ప్రజా విప్లవానికి నాంది పలికారు అన్నారు. రూ.2 లకే కిలో బియ్యం పథకం ద్వారా పేదల ఆకలిని తీర్చడమే కాకుండా, శతాబ్దాల భూస్వామ్య పటేల్-పట్వారీ వ్యవస్థను రద్దు చేసి గ్రామీణ పేదలకు నిజమైన స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం కంటే 20 ఏళ్ల ముందే (1986లోనే) హిందూ వారసత్వ చట్టంలో కూతుళ్లకు సమాన ఆస్తి హక్కు కల్పించిన దార్శనికుడు ఎన్టీఆర్ అని అన్నారు . శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్థాపన ద్వారా మహిళా విద్యకు ప్రోత్సహించారని. 1984 ఆగస్టు సంక్షోభంలో ఢిల్లీ పీఠాన్ని ఎదిరించి, ప్రాంతీయ ఆత్మగౌరవాన్ని కాపాడారని . 'నేషనల్ ఫ్రంట్' చైర్మన్‌గా దేశంలో సంకీర్ణ యుగానికి, బలమైన ఫెడరల్ వ్యవస్థకు పునాది వేశారని అన్నారు . 1983 విజయవాడలో ప్రారంభమైన మొదటి మహానాడు సాంప్రదాయం నేటికీ క్యాడర్‌లో నిరంతర చైతన్యాన్ని నింపుతోందని, మే 28న ఆయన జయంతి వేడుకలను నిర్వహించుకోవడం తెలుగువారందరికీ ఒక సెంటిమెంట్ అని పేర్కొన్నారు. సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ గారి జీవన సూత్రాన్ని ఆదర్శంగా తీసుకుని, సమాజ సేవకు, సంక్షేమానికి పునరంకితం కావడమే ఆ మహానాయకుడికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, మాజీ కౌన్సిలర్లు మిద్దె ఉసేని, కండే శ్యామ్ సుందర్ లాల్, ఉప్పరి సురేష్ కుమార్, బింగుమల్లె శ్యామ్సుందర్ గుప్తా, పసుపులేటి నారాయణ, రామకృష్ణ, సాయిరామ్ మరియు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని "జై ఎన్టీఆర్... జై జై ఎన్టీఆర్" అంటూ నినాదాలు చేశారు.



# రెండో రోజు 'మహానాడు'..

# జోష్‌కు హద్దుల్లేవ్!





## నంద్యాలలో పసుపు సునామీ.. అన్న ఎన్టీఆర్ గారికి ఘన నివాళి అర్పించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో మే 28 ( నంది పత్రిక )** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "మహానాడు" రెండో రోజు వేడుకలు నంద్యాలలో పసుపు సునామీని తలపించాయి. కార్యకర్తల అపూర్వ ఉత్సాహం, జనసందోహంతో రికార్డులు బద్దలయ్యాయి. తొలి రోజు సాంకేతికతను ఆయుధంగా మలుచుకుని, డిజిటల్ శిఖరాలపై పసుపు జెండాను రెపరెపలాడించి సృష్టించిన ప్రభంజనం ఇచ్చిన ఊపుతో, రెండో రోజు వేడుకలు మరింత ఘనంగా జరిగాయి. రెండవ రోజు నంద్యాల నియోజకవర్గంలోని 10 క్లస్టర్లలో మహానాడును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాల ఎన్టీఆర్ షాదీఖానాలో జరిగిన 3వ క్లస్టర్ మరియు గోస్పాడు 10 వ క్లస్టర్ మహానాడు వేదికపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మహానాడు అబ్జర్వర్ నారాయణ స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రెండో రోజు మహానాడు కేవలం ఒక రాజకీయ సభ మాత్రమే కాదు, అది తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, పార్టీ వ్యవస్థాపకులు అయిన నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) గారి జయంతి కావడం విశేషం. ఈ సందర్భంగా వేదికపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు ఇతర నేతలు అన్న ఎన్టీఆర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ షాది ఖానా నందు మరియు గోస్పాడు నందు కేక్ కటింగ్ నిర్వహించారు. ఆ మహనీయుడి స్మృతులను నెమరువేసుకుంటూ పార్టీ శ్రేణులు మరో చారిత్రక ఘట్టానికి సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ తొలి రోజు మహానాడు సృష్టించిన ప్రభంజనం చూస్తుంటే ఒళ్లు పులకరిస్తోందని, కార్యకర్తల అంకితభావమే తెలుగుదేశం పార్టీకి అసలైన శ్రీరామరక్ష అని కొనియాడారు.

సాంకేతికతను ఆయుధంగా మలుచుకుని, మన పసుపు జెండాను డిజిటల్ శిఖరాలపై రెపరెపలాడించిన తీరు అద్భుతమన్నారు. ఈరోజు కేవలం ఒక రాజకీయ సభ కాదు.. తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన నందమూరి తారకరామారావు గారి జయంతి. ఆ మహనీయుడి ఆశయాల సాధన కోసమే మనమంతా పనిచేస్తున్నాం అన్నారు. క్లస్టర్ల వారీగా కార్యకర్తలు చూపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే నంద్యాలలో రికార్డులు బద్దలవ్వడం ఖాయమన్నారు . శ్రేణులంతా ఇదే జోష్‌తో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, మరో చారిత్రక ఘట్టానికి సిద్ధం కావాలి అని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మహానాడును విజయవంతం చేశారు.

# ఎన్టీఆర్ 103 వ జయంతి కార్యక్రమాలు.

**బేతంచెర్ల మే 28 ( నందిపత్రిక )** బేతంచెర్ల పట్టణంలో ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకల కార్యక్రమంలో డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.ఇందన పొదుపు భాధ్యతగా మహానాడు 2026 మహా పండుగ సందర్భంగా డిజిటల్ మరియు క్లస్టర్ స్థాయిలో హైబ్రిడ్ పద్ధతిలో 2 వ రోజు ఎన్టీఆర్ 103 వ జయంతిని బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో ఎన్టీఆర్ చిత్ర ఫటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం క్లస్టర్ -09 లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ లో ప్రసారంను ఎంఎల్ఏ కోట్ల వీక్షించారు. టిడిపి బేతంచెర్ల మండల నాయకులు, కార్యకర్తలు ఎంఎల్ఏతో కలిసి సంతోష సంబరాలతో "ప్రజలే దేవుళ్ళు – సమాజమే దేవాలయం "అన్న నినాదం ఇచ్చిన మహాను భావుడు,నటరత్న పద్మశ్రీ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలను,బేతంచెర్ల పట్టణము మరియు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు డోన్ ఎంఎల్ఏ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గురువారం తెలుగుదేశం పార్టికి ఎనలేని సేవలు చేసిన బేతంచెర్ల టిడిపి నాయకులకు పూలమాలలు వేసి సత్కరించడం జరిగింది.



# గుండెపోటుతో అస్వస్థకు గురైనా ఉపాధి శ్రామికుడు

### -వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైనం



**కొత్తపల్లి – నంది పత్రిక :** ఉపాధి పనుల వద్ద పనులు చేస్తూ ఓ శ్రామికుడు గుండెపోటుకు గురై అస్వస్థ పాలైన సంఘటన గురువారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ అనే ఉపాధి శ్రామికుడు బుధవారం ఉదయం పాలెంచెరువు గ్రామ సమీపంలో జరుగుతున్న పనులకు వెల్లాడు. మొదటి ఫోటో తీసేటప్పుడు బాగానే ఉన్న అతను రెండవ ఫోటో తీసిన తర్వాత చాతిలో నొప్పి, చెమటలు పట్టడం, నీరసంగా ఉండడం, గుండెల్లో మంట అంటూ ఇంటికి వెల్లాడు. ఇంకా సమస్య ఎక్కువ అవ్వడంతో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి మెరుగైనా వైద్యం కోసం కర్నూలుకు రేఫర్ చేశారు వైద్యులు. ప్రస్తుతం " రామకృష్ణ ఆరోగ్యం కొద్దిగా నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఏపీఓ విమలమ్మను వివరణ కోరగా రామకృష్ణ అనే శ్రామికుడికి గుండెపోటు రావడం నిజమేనని, ప్రస్తుతం కర్నూలులో ఓ వైద్యశాలలో చికిత్స అందుతుందన్నారు. ప్రభుత్వ నిబందనలు అతనికి వర్తించేలా చూస్తామన్నారు.

# మురుగునీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకండి.

### కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 28నంది పత్రిక** మురుగునీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి ప్రజలకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా గురువారం ఉదయం చెన్నారెడ్డి కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఎన్.జి.ఓ.కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేయాలని, పాడై పోయిన రోడ్లను బాగు చేయాలని కోరారు. మురుగునీటి కాలువల్లో చెత్తచెదారం వేయడం వలన చెత్త పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయని తెలిపారు. అలాగే ఎక్కడపడితే అక్కడ చెత్త కవర్లలో కట్టి పడేస్తున్నారని తెలిపారు. దీని వలన నగరంలో అపరిశుభ్రత ఎక్కువవుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు ఇవ్వాలని కమిషనర్ కోరారు. ఇలా చేయడం వలన నగరం శుభ్రంగా ఉండడమే కాకుండా రోగాలు వచ్చే అవకాశం తగ్గుతుందని తెలిపారు. చెత్తను వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి ఇచ్చి నగర శుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. నగరంలో పాడై పోయిన అంతర్గత రోడ్లను మరమ్మత్తులు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీ.ఈ.లు రమణ, శిల్ప, శానిటేషన్ సూపర్వైజర్ చెంచయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు ... ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో మే 28 ( నంది పత్రిక )** త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పండుగను పురస్కరించుకొని నంద్యాల భీమవరం రోడ్డులోని అల్వార్ ఖాన్ ఈద్గా నందు గురువారం ప్రత్యేక ప్రార్థనలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రార్థనలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ప్రత్యేక ప్రార్థనలలో కూర్చున్నారు. ప్రార్థనల అనంతరం మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అక్కడికి విచ్చేసిన ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని, హృదయపూర్వక బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి, సమానత్వానికి నిదర్శనం అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో, శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లాలని అల్లాను ప్రార్థించామని తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియర్ ఖలీల్, అబ్దుల్ హాదీ, ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# టిడిపి పేదల కోసమే పుట్టిన పార్టీ





## మహానాడు సక్సెస్ - మహిళలకు ఎమ్మెల్యే బుడ్డా కృతజ్ఞతలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 28:** శ్రీశైలం నియోజకవర్గం లో క్లస్టర్ల స్థాయిలో రెండు రోజులపాటు నిర్వహించిన మహానాడు కార్యక్రమం విజయవంతమైంది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండలంలోని బండి ఆత్మకూరు, పార్నపల్లె లకు సంబంధించిన క్లస్టర్లు భోజనం మల్లేశ్వర్ రెడ్డి కంచర్ల లింగారెడ్డి ల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మహానాడు కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం నాడు జరిగిన మహానాడు కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు మహిళా లోకం కూడా పెద్ద ఎత్తున మహానాడు కార్యక్రమానికి తరలివచ్చింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రుల ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం మహానాడు సభలో ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ పరిధిలో క్లస్టర్ల పరిధిలో మహానాడు ఇంత పెద్ద ఎత్తున జరుగుతుందని ఊహించలేదని, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గతంలో జరిగిన మహానాడుకు ప్రస్తుతం క్లస్టర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడుకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు ఏదో ఒక జిల్లాలో మహానాడు కార్యక్రమం జరుగుతూ ఉండేదని, ఇక్కడి నుండి అంత దూరం కార్యకర్తలు వెళ్లాలంటే ఎంతో ప్రయాసలతో కూడుకున్న పని అని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ కమిటీ యువ నాయకుడు లోకేష్, నిర్ణయం తీసుకొని క్లస్టర్ల స్థాయిలో మహానాడు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హ ర్షించదగ్గ విషయమని అన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జన్మదిన సందర్భంగా మహానాడు కార్యక్రమాలను నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. మహానాడు అంటే ఏమిటో క్రింది స్థాయి కార్యకర్తలకు కూడా తెలియాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే సిద్ధాంతాలతో పుట్టిన పార్టీ అని, బడుగు బలహీనవర్గాల వారిని ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో పుట్టిన పార్టీ అని గుర్ధ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు 35 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని కాంగ్రెస్ నాయకులు పరిపాలించారని, వారి పరిపాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆరు నెలలపాటు రాష్ట్రమంతటా 36 వేల కిలోమీటర్లు తిరిగారని బుడ్డా గుర్తు చేశారు. అవినీతి రహితమైన పాలన అందించాలని, పేద బడుగు వర్గాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి పేదల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ప్రధానంగా తెలుగు గంగ ను నందమూరి తారక రామారావు ఏర్పాటు చేయడం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. 1985లో తెలుగు గంగ ఏర్పాటుకు అప్పట్లో ఎన్టీఆర్ శంకుస్థాపన చేయడం జరిగిందని 1996లో కాలువ నిర్మాణం పూర్తి అయినది అని చెప్పారు. గతంలో ఈ ప్రాంతమంతా బీడు భూములుగా ఉండేవని, పంటలు సాగుకు నోచుకోక కడుపునిండా తినే పరిస్థితులు కూడా అప్పట్లో ఉండేవి అని చెప్పారు. ఎన్టీ రామారావు పుణ్యమా అని తెలుగంగ ఏర్పాటు కావడంతో, నేడు రైతులందరూ రెండు కార్లు పుష్కలంగా పంటలు పండించుకుంటూ తాము కడుపు నింపుకుంటూ పదిమందికి అన్నం పెట్టే స్థాయికి చేరుకున్నారంటే అది ఎన్టీ రామారావు చదివేనని బుడ్డా కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చలవతో శ్రీశైలం నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో గ్రామ గ్రామాన సిమెంట్లు రోడ్లు నిర్మించుకోవడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎంతోమంది పేదలకు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలను పేదలకు అందివ్వడం జరిగిందని అన్నారు. రాబోవు రోజులలో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలు అందరూ పార్టీని బలోపేతం చేసేందుకు,అభివృద్ధి కొరకు సిద్ధం కావాలని బుడ్డా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఎమ్మెల్యే సన్మానించారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రెండు రోజులపాటు మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషిచేసిన క్లస్టర్లను, యూనిట్లను, గ్రామ అధ్యక్షులను, బూత్ కన్వీనర్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

### మహానాడు సక్సెస్ లో పాలు పంచుకున్న టిడిపి కార్యవర్గం

క్లస్టర్ల పరిధిలో రెండు రోజులపాటు జరిగిన మహానాడు కార్యక్రమం విజయవంతం అయ్యే విషయంలో తెలుగుదేశం పార్టీ కార్యవర్గం కార్యకర్తలు పాలుపంచుకున్నారు. గ్రామ గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలను మహిళలను మహానాడు కార్యక్రమానికి వచ్చేలా కృషి చేశారు. నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్ రెడ్డి, తెలుగు గంగ డిస్ట్రిబ్యూటర్ వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్ చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ముమ్మడి కృష్ణారెడ్డి, పరమటూరు సింగిల్ విండో చైర్మన్ సాయి బాబా రెడ్డి, యువ నాయకుడు రేగటి రాజశేఖర్ రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు చిట్టిబట్ల భరద్వాజ్ శర్మ, వడ్డు మధుసూదన్ రెడ్డి, నల్ల నాగేశ్వర్ రెడ్డి, జాకీర్ ఖాన్, పాల సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, బైరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ మాజీ కన్వీనర్ నందిపాటి నరసింహారెడ్డి, లతోపాటు ఆయా గ్రామాల అధ్యక్షులు, మహానాడు విజయవంతం కావడంలో కృషి చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు అందరికీ క్లస్టర్లు కంచర్ల లింగారెడ్డి, భోజనం మల్లేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమకు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మహానాడు సక్సెస్ కావడంతో పార్టీ వర్గాలు ఎంతో సంబరపడుతున్నాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ జగన్మోహన్, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమం విజయవంతమైనందుకు బందోబస్తు నిర్వహించినందుకు క్లస్టర్లు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.





## తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

**చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంది**

**రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెదేపా శాశ్వతంగా అధికారంలో ఉండాలి**

**మంత్రాలయం లో రెండవ రోజు కొనసాగిన డిజిటల్ మహానాడు వేడుకలు**

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి**



**మంత్రాలయం ,మే 28,నంది న్యూస్ :-** తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత , టిడిపి పార్టీ వ్యవస్థాపకులు , స్వర్గీయ నందమూరి తారక రామారావు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని వాసవి కళ్యాణ మండపంలో రెండవ రోజు డిజిటల్ మహనాడు వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి , కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని , అందుకోసం టిడిపి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పన్నాగ వేంకటేశప్ప స్వామి,చిలకలడోణ యల్లారెడ్డి, మాధవరం అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణా మోహన్ రెడ్డి,విజయరామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి,నర్సారెడ్డి,వట్టేప్ప నరసింహులు,వగరూరు అబ్దుల్ సాబ్,లక్ష్మారి రామయ్య,మాలపల్లి భీమన్న ఆచారి, తిక్కస్వామి గౌడ్,సుగూరు ఈరన్న, సుజ్ఞాన్నాం , యస్ సి సెల్ నాయకులు యోబు,రవి, భీమన్న, హనుమంతు,సాయి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు



## 10 వేలు ఆర్థిక సహాయం చేసిన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి



**బేతంచెర్ల మే 28 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు కొండమ్మ ప్రభాకర్ మరియు లారీ డ్రైవర్ గజ్జి దేవదాసు కు కొంతకాలంగా అనారోగ్యంతో, గుండె ఆపరేషన్ చేయించు కున్నారు. వారికి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడ మన్న విషయం తెలుసుకున్న బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) బుగ్గన నాగభూషణశీ రెడ్డి, ప్రభాకర్ కు 5 వేల రూపాయలు, గజ్జి దేవ దాసుకు 5 వేల రూపాయలు ఇద్దరికీ కలిపి 10 వేల రూపాయలు ఆర్థిక సాహయంను గురువారం నాడు అంద జేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాపేట వైసిపి కార్యకర్తలు గజ్జి మురళి, నత్తి మృత్యుంజయుడు, కొండమ్మ రవి, ముద్దవరం నరేష్,జొల్లు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంబరాలతో రెండవ రోజు మహానాడు కార్యక్రమానికి హాజరైన మహాదేవపురం టిడిపి నాయకులు

**కార్యకర్తలకు ఘన స్వాగతం పలికిన రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి**



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండలంలో కార్యకర్తల ఉత్సవంతో వైభవంగా జరుగుతున్న మహానాడు కార్యక్రమం కార్యకర్తలతో పసుపు పండుగల మారిందని కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అలాగే మహాదేవపురం టిడిపి ఇంచార్జ్ మహేష్ శ్రీ సర్వ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు సిరివెళ్ల మండల కేంద్రంలో మినీ మహానాడు కార్యక్రమం భారీగా విజయవంతం చేసినందుకు టిడిపికార్యకర్తలకు భూమా అభిమానులకు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,అలాగే మహాదేవపురం టిడిపి ఇంచార్జ్ మహేష్, శ్రీ సర్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్ర, కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముందుగా అన్న నందమూరి తారక రామారావు గారి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగిందని వారు తెలుపుతూ, మహానాడు కార్యక్రమాన్ని రెండు రోజులపాటు స్థానిక సిరివెళ్ల పట్టణంలోని టిడిపి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మహానాడు కార్యక్రమం సరికొత్త డిజిటల్ రికార్డు సృష్టించాయి. సాంకేతికతను అద్భుతంగా వాడుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా1875 క్లస్టర్ల నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన వచ్చిందని ఆయన తెలుపుతూ రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మహాదేవపురం టిడిపి నాయకులు, పగడాల గురుబ్రహ్మం, వేల్పుల పోలరాజు,అంగడి శ్రీను, మధు, చిన్న, కోటిలింగం, తిమ్మయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు మహోత్సవంలో సరికొత్త సాంకేతికత:





## క్లస్టర్ స్థాయిలో హైబ్రిడ్ విధానం అభినందనీయం.. డోన్ ఎమ్మెల్యే కోట్ల

**నందిపత్రిక -ప్యాపిలి** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మహానాడు 2026' మహా పండుగ రెండవ రోజు వేడుకలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్తగా సాగాయనీ ఇంధన పొదుపు, సమయ నిర్వహణే లక్ష్యంగా డిజిటల్ భౌతిక రూపాల కలయికతో క్లస్టర్ స్థాయిలో హైబ్రిడ్ విధానంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు .ఇందులో భాగంగా ప్యాపిలి పట్టణంలోని స్థానిక షాది ఖానా నందు క్లస్టర్-05 పరిధిలో ప్రత్యేక డిజిటల్ స్క్రీన్ ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డోన్ ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత ఆయన తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతను సామాన్య ప్రజలకు సైతం చేరువ చేస్తూ, సమాజ ప్రయోజనాల కోసం నిరంతరం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని కొనియాడారు. "ఇంధన పొదుపు, సమయపాలన, పార్టీ కార్యకర్తల మధ్య పటిష్టమైన సమన్వయం సాధించడమే లక్ష్యంగా ఈ ఏడాది మహానాడు కార్యక్రమాలను హైబ్రిడ్ విధానంలో నిర్వహించడం నిజంగా అభినందనీయం అన్నారు. మహానాడు వేదికగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై కీలకమైన చర్చలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను జోడించి పార్టీ శ్రేణులను ఒకే తాటిపైకి తెచ్చిన ఈ ప్రయోగం రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ డిజిటల్ ప్రసార కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి,డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా రేణుక,శ్రీనివాసులు, రాజా నారాయణమూర్తి, ఖాజాపీర్, రమేష్ రెడ్డి,కొంగనపల్లి మధు, రాంమోహన్, నాగేంద్ర, నేరేడుచర్ల వెంకటేష్, చల్లా వీర, ఎస్కేవలి, వార్డ్ మెంబర్ వెంకటేష్,మధు,డిష్ శ్రీను, పరమేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..!!





## 103వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.

**కడప, బ్యూరో చీఫ్ మే 28నంది పత్రిక** : తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు చిరస్మరణీయమని, నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా సాంస్కృతిక పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ 103వ జయంతి ఉత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 1923 మే 28న మన రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పామర్రు మండలం.. నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో జన్మించి ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల గౌరవాన్ని పెంచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా తనదైన ముద్ర వేసి కోట్లాది ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న మహానాయకుడని పేర్కొన్నారు.తెలుగు ప్రజల గుండెల్లో "అన్నగారు"గా చిరస్థాయిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. పౌరాణిక పాత్రలకు జీవం పోసి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పారని కొనియాడారు.సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఎన్టీఆర్, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. కేవలం తొమ్మిది నెలల్లోనే ప్రజాభిమానంతో అధికారంలోకి రావడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేయడం వంటి నిర్ణయాలు సామాజిక మార్పుకు దోహదపడ్డాయని తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు.ఎన్టీఆర్ జీవితం క్రమశిక్షణ, పట్టుదల, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిందని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. డిఆర్వో మల్లికార్జునుడు మాట్లాడుతూ... ఎన్టీఆర్ గారు.. ఒక్క నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. తెలుగు, తమిళం, హిందీ, గుజరాతీ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి, పౌరాణిక పాత్రలకు జీవం పోసిన మహానటుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి పాత్రల్లో ఆయన నటన తెలుగు ప్రజల హృదయాల్లో దైవస్వరూపంగా నిలిచిపోయిందన్నారు. సినీ రంగంలో అపార ప్రజాదరణ పొందిన తర్వాత ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఎన్టీఆర్, తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. ప్రజల మధ్యకే వెళ్లి "చైతన్య రథం" ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజల్లో చైతన్యం నింపారని తెలిపారు. కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘనత సాధించారని పేర్కొన్నారు.స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలకు ఎన్టీఆర్ చేసిన సేవలు అమూల్యమని, తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిన మహానుభావుడని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, క్రమశిక్షణ, ప్రజాసేవకు ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో పేద ప్రజల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ వివరించారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన దూరదృష్టి గల నాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. నేటి యువత ఎన్టీఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వం, సమాజ సేవ భావన అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలు, సంక్షేమ భావజాలం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి, డిఆర్డిఏ పీడి రాజ్యలక్ష్మి, డీఏవో సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏపీఎంఐపి పీడి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్టీఆర్ అభిమానులు, విద్యార్థులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో 'బక్రీద్' వేడుకలు





## శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లిం సోదరులు

**నందిపత్రిక -ప్యాపిలి** మండల కేంద్రమైన ప్యాపిలితో పాటు చుట్టుపక్కల గ్రామాలలో ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే త్యాగానికి ప్రతీక అయిన 'బక్రీద్' (ఈద్–ఉల్–అధా) పండుగ వేడుకలను గురువారం ఘనంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ముస్లిం సోదరులు, చిన్నలు, పెద్దలు అందరూ సాంప్రదాయ నూతన వస్త్రాలు ధరించి స్థానిక ఈద్గా మైదానానికి, మసీదులకు భారీగా చేరుకున్నారు.

విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు

ఈద్గా మైదానంలో ప్రభుత్వ ఖాజీ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో బక్రీద్ ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బక్రీద్ పండుగ విశిష్టతను, హజరత్ ఇబ్రహీం త్యాగాన్ని కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వాలతో మెలగాలని, పేదలకు దానధర్మాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక దువా (ప్రార్థన) చేశారు.

**మిన్నంటిన పండగ సంబరాలు**నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ ప్రేమగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్న పిల్లలు ఉత్సాహంగా పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ముస్లిం ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రముఖులు ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు అందజేశారు.

**కట్టుదిట్టమైన ఏర్పాట్లు** ఈద్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్యాపిలి పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. నమాజ్ సమయాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. బక్రీద్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిభావంతో ముగిశాయి.



# బద్వేల్ నియోజకవర్గ బీసీ యాదవ్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్ శేఖర్ బాబు నియామకం

**పోరుమామిళ్ల మే 28 (నంది పత్రిక)**:బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్సీపీ బీసీ యాదవ్ వింగ్ అధ్యక్షుడిగా పోరుమామిళ్ల మండలం నాగలకుంట్ల గ్రామానికి చెందిన ఎస్ శేఖర్ బాబును పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ శేఖర్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ పదవి రావడానికి సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి గారికి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి గారికి, ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి గారికి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా మేడం గారికి, మాజీ ప్రభుత్వ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి గారికి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రమణ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరి ఆశీస్సులతో తాను మరింత బాధ్యతాయుతంగా పని చేస్తానని ఎస్ శేఖర్ బాబు స్పష్టం చేశారు. బీసీ యాదవ్ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి, వారికి అండగా నిలబడేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. రానున్న రోజుల్లో బద్వేల్ నియోజకవర్గంలో

వైఎస్సార్సీపీని మరింత బలంగా నిలబెట్టేందుకు సమష్టిగా పని చేస్తామని పేర్కొన్నారు.



# నేడే మండల సర్వసభ్య సమావేశం



**జూపాడు బంగ్లా :మే: 28 : (నంది పత్రిక)** మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఎం. నీలమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో డి.గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశపు హాల్ నందు జరిగే సాధారణ సర్వసభ్య సమావేశానికి మండల పరిధిలోని ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మండల మరియు గ్రామస్థాయి అధికారులు అందరూ హాజరు కావలసిందిగా ఎంపీడీవో కోరారు. వివిధ శాఖలపై జరిగే సమీక్షకు మండల స్థాయి అధికారులు అవసరమైన వివరాలతో తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా కోరుతున్నట్లు ఎంపీడీవో డి. గోపికృష్ణ తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



**జూపాడుబంగ్లా: మే :28: (నంది పత్రిక)** మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు కొత్త దుస్తులు ధరించి బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గాలు మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ అల్లాహ్ ఇబ్రహీం ను పరీక్షించేందుకు తను ప్రేమించిన కుమారుడు ఇస్మాయిల్ ను త్యాగం చేయమని ఆదేశించారు. ఇబ్రహీం ప్రవక్త తన కుమారుని త్యాగం చేయడానికి సిద్ధమయ్యాడు. అల్లాహ్ ఆయన విధేయతను మెచ్చి చివరిగా ఒక గొర్రెని పంపించి తన త్యాగానికి ప్రత్యామ్నాయంగా ఆ జంతువును త్యాగం చేయమని సూచించారు. ఈ సంఘటనను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. త్యాగం చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా పంచుతారు. ఒక భాగం కుటుంబానికి, ఒక భాగం స్నేహితులకు, మూడవ భావం పేదలకు, సహకారం, దాతృత్వం , సోదరి భావం పెంపొందించుకోవడం ఉద్దేశం అన్నారు. దయా భావాన్ని, త్యాగ స్ఫూర్తిని బోధిస్తుంది.

## ఘనంగా జననేత ఇరిగెల రాంపుల్లా రెడ్డి గారి జన్మదిన వేడుకలు



**శిరివెళ్ళ :(నంది పత్రిక)** శిరివెళ్ళలో జననేత ఆళ్లగడ్డ ముద్దు బిడ్డ తాలూకా జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ ఇరిగెల రాంపుల్లా రెడ్డి గారి జన్మ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ కార్యకర్తలు నాయకులు కలిసి కేక్ కటింగ్ చేశారు. శిరివెళ్ళ ఇరిగెల అభిమానులు ఏర్పాట్లు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ గౌ శ్రీ రాంపుల్లా రెడ్డి గారు వీరి కుటుంబం చల్లగా ఉండాలని దేవునితో ప్రార్దించడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవలో ఇంకా ఎక్కువగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆలమూరు గౌస్, ఓబుళా కొండా రెడ్డి, ఖ తేజోనాథ్(తేజ), పఠాన్ ఇబ్రహీం ఖాన్, తలారి పెద్ద బాలయ్య, బండెద్దుల ఖాదర్, హుస్సేన్ పీరా, పెసరాయి చాంద్ బాషా, పోల నాగరాజు శెట్టి, సి మధు, , ముల్లా అక్బర్ బాషా, చెన్నూరు అశోక్, ఆలమూరు రఫీ, చిన్న కంబలూరు రవి,ఉల్లి రమేష్, ఇట్టెం మద్దిలేటి,నామాల వెంకటస్వామి, రాం సుబ్బయ్య, షేక్ సమీర్,జాబీర్, పెసరాయి జాఫర్, ఆలమూరు మహబూబ్ బాషా, ఫారూఖ్ ,యూనుస్, బుర్రు ఖలీల్ తదితర జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మే 29న వాసవి పెనుగొండలో "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" మూడవ విడత కార్యక్రమం

### ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 28 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా మే 29న ఆచంట నియోజకవర్గంలోని వాసవి పెనుగొండలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.వాసవి పెనుగొండలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో మే15న తొలి విడత, మే 22న రెండో విడత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మే 29న మూడవ విడత కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 8.30 గంటలకే వాసవి పెనుగొండలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణానికి తప్పనిసరిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు..

# పేద ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం

# ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి





### తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమ పాలనకు ఆద్యుడు ఎన్టీ రామారావు

**మహానంది మే 28 (నంది పత్రిక):-** పేద బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ పుట్టిందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.మహానంది లోని కమ్మ భవన్లో నిర్వహించిన వర్చువల్ తెలుగుదేశం పార్టీ మహానాడు సమావేశంలో పాల్గొన్నారు.ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమ పాలనకు ఆద్యుడిగా పేరొందిన నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన చారిత్రాత్మక పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.పేదల ఆకలి తీర్చడం నుండి మహిళల సాధికారత వరకు ఆయన ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టారు.తెలుగుగంగ కాలువ ద్వారా రాయలసీమకు సాగునీరు,తాగునీరు ఎన్టీఆర్ అందించారన్నారు. సినీ రాజకీయా రంగాల్లో ప్రభంజనం సృష్టించారన్నారు.మహిళలు పురుషులకు ఏమాత్రం తీసుకోకుండా మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారన్నారు. పేద ప్రజల సంక్షేమ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు.కిలో రెండు రూపాయల బియ్యం, చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, పింఛన్లు, పేదవారికి తక్కువ ధరకే నాణ్యమైన జనతా వస్త్రాలు , ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నేడు సీఎం చంద్రబాబు మహానుభావుడు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు.చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఒకరోజు 24 గంటల్లో 18 గంటలు సమయం రాష్ట్ర అభివృద్ధికి కేటాయిస్తున్నారన్నారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థల్లో విప్లవణాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 33 శాతం మహిళా రిజర్వేషన్లు కేటాయించడం గర్వించదగ్గ విషయం అన్నారు.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులు రానున్న పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఎక్కడ పోటీ చేసిన కూటమిన్ నేతలు ప్రభంజనం సృష్టించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ తెలుగుదేశం మహిళా కార్యకర్తలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కంచర్ల శివశంకర్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జి నరాల చంద్రమౌళిశ్వర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు శ్యామల జనార్దన్ రెడ్డి,టిడిపి మాజీ అధ్యక్షుడు ఉల్లి మధు, తెలుగుగంగ డిస్ట్రిబ్యూటీ చైర్మన్ క్రాంతి కుమార్ యాదవ్,మాజీ ఎంపీపీ నాగభూపాల్ రెడ్డి, శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ రవినాథ రావు, తిమ్మాపురం వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ నూలు వెంకటరంగయ్య, యూనిట్ ఇంచార్జ్ భాష్యం రాముడు గౌడ్,పార్టీ మహిళ నాయకురాలు మాజీ ఎంపీపీ చింతం నాగమణి,శశికళ కొండారెడ్డి, ఉమాదేవి, టీడీపీ నాయకులు హరినాథ్ చౌదరి, గంగిశెట్టి మల్లికార్జునరావు, పాశం రాజు, కుంచెపు రమణ, మారెడ్డి జయరాం, మాజీ సర్పంచ్ చింతం రాముడు, పాశం శ్రీను, సతీష్ కుమార్ చౌదరి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, పోలిశెట్టి నాగ పుల్లయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు

### స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరంబ్యూరో చీఫ్ ; మే 28,నంది పత్రిక** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను గురువారం పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి తదితర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ప్రజా సేవకు ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరరావు, డిటి ఏం.సన్యాసిరావు, తదితరులు పాల్గొని స్వర్గీయ ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.



# తెలుగు ప్రజలఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి





### మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్ టి రామారావు

### జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

**ఏలూరు, బ్యూరో చీఫ్ మే, 28 : నంది పత్రిక** తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు గురువారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో కేకును కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ లు ఎన్ .టి. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్ .టి. రామారావు ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు పాలనాపరమైన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సామజిక పెన్షన్లు, మహిళలకు ఆస్తిలో హక్కు, పేదల ఆరోగ్య భద్రతకు 2 రూపాయలకే కిలో బియ్యం వంటి ఎన్నో పథకాలను తీసుకువచ్చారన్నారు. రాజకీయవేత్తగానే కాక నటుడిగా కూడా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన నటనకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారన్నారు. ప్రజలకు మెరుగైన పాలనతో పాటు ప్రజలకు సంతృప్తికరమైన రీతిలో సేవలను అందించేందుకు ప్రాధాన్యతను ఇచ్చేవారన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, రైతుల సంక్షేమానికి డా. నందమూరి తారక రామారావు ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారన్నారు. పార్టీని స్థాపించిన 9 నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టి, ముఖ్యమంత్రి పదవి చేపట్టి చరిత్ర సృష్టించారన్నారు. సామజిక పెన్షన్లను అన్న రామారావు 30 రూపాయలతో ప్రవేశపెట్టారని, ఆ పెన్షన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 4 వేల రూపాయలకు తీసువెళ్లారన్నారు. ప్రజల ఆహారభద్రతకు 2 రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేదప్రజలకు కూడు, గూడు, నీడ అందిస్తానని వాగ్దానం చేసి అమలు చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, ఆర్డీఓ కె. లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, ఎస్డిసి భాస్కర్, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, పర్యాటకాధికారి పట్టాభి రామయ్య, ఐసిడిఎస్ పీడీ శారద, ఎల్డిఎమ్ నీలాద్రి, కలెక్టరేట్ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.



## నిర్మాణంలో ఉన్న కోపల్లె నాలుగు లేన్ల వంతెన పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ మే 28నంది పత్రిక** కాళ్ళ మండలం కోపల్లెలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నాలుగు లేన్ల వంతెన పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పనుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడేలా ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ వంతెన నిర్మాణం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అధికారులు వంతెన నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ప్రస్తుత పనుల పురోగతి, మిగిలిన పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్ అండ్ బి అధికారి అడబాల శ్రీనివాసరావు, గుత్తేదారు అర్జునరాజు, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆక్వా రంగ స్థిరత్వానికి పారదర్శక విధానాలే పరిష్కారం

### - ఫీడ్, సీడ్ నాణ్యతపై కఠిన పర్యవేక్షణ : మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి,బ్యూరో చీఫ్ మే 28:నంది పత్రిక** ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రింప్ ఫీడ్ ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయభారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రైతులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, పరిశ్రమ ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వం సమగ్రంగా విన్నదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో ఫీడ్ ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో ఫీడ్ పరిశ్రమ కూడా ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీడ్, సీడ్ నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, సీసీటీవీ ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేసబిలిటీ, ×శీ ఆధారిత మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జిఎం సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ఆక్వా రైతుల సంక్షేమం, ఫీడ్ పరిశ్రమ స్థిరత్వం, ఎగుమతుల వృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, అన్ని భాగస్వామ్యులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, అధికారులు, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమరెడ్డి, ఏ ఏ సి సభ్యులు, అప్సడా సభ్యులు, రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘాలు, పరిశ్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ ఆశయ సాధనకై కృషి చేయాలి... గుండ్రెడ్డి మోహన్ రెడ్డి

**జూపాడుబంగ్లా :మే: 28: (నంది పత్రిక)** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు పునరంకితం అవుతూ పార్టీకి దిశా నిర్దేశం చేసిన వేదికగా మహానాడు నిలుస్తుందిని పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల లోని మండ్లేము గ్రామంలో క్లస్టర్ ఇంచార్జి రవికాంత్ ఆధ్వర్యంలో డిజిటల్ మహానాడు నిర్వహించారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు103 వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలు వేసి గణ నివాళులు అర్పించారు. మండ్లేము గ్రామంలో టిడిపి 8వ క్లస్టర్ డిజిటల్ స్క్రిన్ ద్వారా రెండవ రోజు టిడిపి కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాలు నాయకులు ప్రసంగాలు వీక్షించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ రవికాంత్, మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ 1982లో పార్టీ అరిర్భావం నుంచి మహానాడు పార్టీకి దిశా నిర్దేశం చేసే వేదికగా కొనసాగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజల ఆశయాలకు ప్రతీకగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి ముందుకు సాగుతుందన్నారు. పసుపు జెండా పట్టిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే మహానాడు లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి ఎన్నెముక ఐక్యంగా పనిచేస్తే పార్టీ మరింత బలపడుతుందిఅని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తర్తూర్ రమణారెడ్డి, తుడిచెర్ల సుధాకర్, నల్లబోతుల రాముడు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**మంత్రాలయం మే 28, (నంది) న్యూస్:-** త్యాగానికి ప్రతీక ఈదుల్ జుహ (బక్రీద్) పండుగ ను ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రాలయం లో జామియా మసీదు నుండి మాధవరం రోడ్డు లో ఉన్న ఈద్గ వరకు ముస్లిం సోదరులు ర్యాలీ గా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ జామియా మసీదు పేష్ ఇమాం ఖాజాబందేనవాజ్ బక్రీద్ యొక్క విసిష్ట గురించి ప్రసంగించి , నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ అంటు ఆలింగనం చేసుకున్నారు. చిన్నారులు సైతం ఆలింగనం చేసుకున్నారు. అక్కడి కి వచ్చిన వారికి దాన ధర్మాలు చేశారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే మండలంలోని మాలపల్లి, సుంకేశ్వరి, తుంగభద్ర, రాంపురం, సింగ రాజనహల్లి, మాధవరం, వగరూరు, సూగురు, తిమ్మాపురం, తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జామీయ మసీదు కమీటి , యూత్ కమిటీ సభ్యులు ఉన్నారు.



# చంద్రబాబు నాయకత్వం లో ఆంధ్రప్రదేశ్ సుభిక్షం



## రెండవ రోజు కొనసాగిన డిజిటల్ మహానాడు కార్యక్రమం

## మహానాడు లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## టీడీపీ యువ నాయకులు ఎన్. రాకేష్ రెడ్డి

**మంత్రాలయం మే 28,(నంది )న్యూస్ :-** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లో ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉందని మంత్రాలయం టీడీపీ యువ నాయకులు ఎన్. రాకేష్ రెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయం లోని రివరిన్ కళ్యాణ మండపంలో రెండవ రోజు కొనసాగిన డిజిటల్ మహనాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహనాడు కార్యక్రమంలో భాగంగా తెదేపా పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి ని పురస్కరించుకుని ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి , కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతను సామాన్య ప్రజలకు సైతం చేరువ చేస్తూ, సమాజ ప్రయోజనాల కోసం నిరంతరం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని కొనియాడారు. మహానాడు వేదికగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై కీలకమైన చర్చలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను జోడించి పార్టీ శ్రేణులను ఒకే తాటిపైకి తెచ్చిన ఈ ప్రయోగం రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ఎంతో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక డిజిటల్ స్క్రీన్ ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు ఎస్ఎం గోపాల్ రెడ్డి , మంత్రాలయం పట్టణ అధ్యక్షులు వరదరాజు , రైతు సంఘం నాయకులు చావిడి వెంకటేష్ , ఎల్లెల్సీ నీటి వైస్ చైర్మన్ మాలపల్లి చంద్ర , మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య , క్లస్టర్ ఇన్చార్జ్ బెస్త పవన్ కుమార్ , వగరూర్ గోపాల్ , ఎంపిటిసి నెక్కి వెంకటేష్ , వగరూర్ పవన్ కుమార్ , మద్రి రాఘవేంద్ర , టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## జంబులా పరమేశ్వరి ఆలయానికి 4 కేజీల వెండి ఆభరణాలు విరాళం.

**రుద్రవరం ప్రతినిధి మే 28 (నంది పత్రిక):** మండల కేంద్రానికి సమీపంలో వెలసిన శ్రీ జంబులా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు అంకితభావంతో విరాళాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయానికి 4 కేజీల వెండి ఆభరణాలను దాతలు విరాళంగా సమర్పించారు. ఈ కానుకలను ఆళ్లగడ్డకు చెందిన సోమగౌడ్ జయరామ్ గౌడ్, వారి భార్య మరియు వారి కుమారులు ఎస్. ధరణికుమార్, కె. వినయ్‌కుమార్ అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ పూజారి జంబులయ్య తెలిపారు. అమ్మవారిపై ఉన్న భక్తితో ఈ విరాళాన్ని అందజేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు అభినందించారు.



## ఘనంగా నందమూరి తారక రామారావు జయంతి వేడుక

**బనగానపల్లె మే 28 నంది పత్రిక** విశ్వవిఖ్యాత నటుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు బనగానపల్లె నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న మండల కేంద్రాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.



## ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు పరిపాలన కొనసాగుతుంది..ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి. రామారావు ఆశయాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలన, సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా సీ.ఎం చంద్రబాబు పరిపాలనను కొనసాగిస్తున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్.టీ.రామారావు జయంతి వేడుకల్లో జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన ఎంపీ, అనంతరం కేక్ కట్ చేశారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నమ్మకంతో అన్న ఎన్టీఆర్ తెలుగుదేం పార్టీని స్థాపించి, పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేసారని కొనియాడారు..ఇక డిజిటల్ మహానాడు విజయవంతంగా సాగుతుందన్న ఎంపీ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందినా పొందకపోయిన, రాష్ట్రంలోని మహిళలకు 33 శాతం సీట్లు కల్పిస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించడం మహిళల పై తెలుగుదేశం పార్టీకి ఉన్న గౌరవానికి నిదర్శనం అన్నారు.. స్థానిక సంస్థల ఎన్నికల వేల వైసీపీ పార్టీ అలజడులు సృష్టించేందుకు ప్రణాళికలు రచిస్తుందని, కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా వాటిని ఎదురుకోవాలని ఎంపీ సూచించారు...ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉత్సుకతను శక్తిగా మార్చుకో అభివృద్ధిలో సారథివై సాగిపో



**నంది పత్రిక:** ఓ మనిషి ఆలోచనల ప్రవాహాన్నిఆపకునీలోనిఉత్సుకతనుమేల్కొలుపుఆలోచనే నీఆయుదం ఆలోచనే నీ అభివృద్ధి ఆలోచనే నీ చైతన్యంఉత్సాహం ఉషారు

ఉల్లాసం నీ జీవన శైలి అవుతే ప్రగతి సాధననీ కార్యచరణ ఔతది

ప్రశ్నించే నైజంనీకు ఒక వరం ,అదే నీప్రగతికి మూలాధారంమనసులో కలిగే ఆలోచలను చేతుల్లో చూపే శక్తిగా మార్చు ఆశయాల వైపు అడుగులు వేస్తూలక్ష్యసాధనకు ఉపక్రమించు. ఊహల ప్రపంచం దాటిపో. వాస్తవ రూపం వైపు సాగిపో వట్టి మాటలు కట్టి పెట్టి గట్టి మేలు తల పెట్టవోయ్ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేస్తూ నీ సృజనను శ్రమను ఉత్పాదకత శక్తిగా మార్చు శక్తిని వృధా చేయక. మారుతున్న కాలంతో నీవు మారినైపుణ్యాలకు పదును పెట్టు అభివృద్ధిని మొదలు పెట్టు సానుకూల ఆలోచనలతో సమాజాన్ని మార్చేయ్ పట్టుదల సంకల్పంతో ఉత్సాహంతో లక్ష్య సాధనకు ముందడుగు వేయాలి నీ ప్రగతి పయనం సాగాలి. విజయ తీరాలను తాకాలి నీలోని ఉత్సుకత కొత్త ఆలోచనలను ప్రశ్నలను రేకెత్తించటానికిమొదటి అడుగు కావాలి. ఉత్సుకత శక్తి సామర్థ్యాలమేళవింపుతో మెరుగైనప్రగతిశీల కార్యాచరణతో మెరుగైన సమాజ అభివృద్ధిలో సారధిగా సాగిపో ఉత్సుకత ఉల్లాసం ఉత్సాహం ఊపిరిగా సమాజంలో ఉత్పాదకశక్తిగా ఎదిగి వికసిత భారత్ లక్ష్యసాధనకుఉపక్రమించాలి. నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం కరీంనగర్.

## ఇంటి పట్టాలు ఇచ్చి వదిలేయడం కాదు హద్దులు చూపించి ఇళ్లు నిర్మించేలా చేయాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ



**కర్నూల్ ప్రతినిధి నందిపత్రిక** కర్నూలు రూరల్ మండలం దిన్నె దేవరపాడు గ్రామ ప్రజల సొంతింటి కల ఇప్పటికీ నెరవేరకపోవడం అత్యంత దురదృష్టకరమని, ప్రభుత్వాలు మారినా గ్రామస్తుల సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం దిన్నె దేవరపాడు గ్రామంలో గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించిన సమస్యల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 300 మందికి పైగా పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని, అయితే అనంతరం వచ్చిన ప్రభుత్వాలు వాటిపై సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్ల నిర్మాణానికి నోచుకోలేక పోతున్నారని విమర్శించారు. ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ సంబంధిత భూములకు సర్వే నిర్వహించక పోవడం, నంబర్ రాళ్లు పాతకపోవడం, హద్దులు నిర్ధారించకపోవడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. దిన్నె దేవరపాడు గ్రామ ప్రజల దశాబ్దాల సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ దిన్నె దేవరపాడు గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 427, 428, 429, 430లలో 2013 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వే పూర్తి చేసి, లబ్ధిదారులకు స్పష్టమైన హద్దులు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని సుమలత కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు మంత్రాలయం టీడీపీ ఇంచార్జి శ్రీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి



**మంత్రాలయం , మే 28,నంది న్యూస్ :-** మంత్రాలయం నియోజకవర్గంలో భాగంగా 10 క్లస్టర్స్ లో నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ మండలాధ్యక్షులకు నియోజకవర్గ ముఖ్య నాయకులకు క్లస్టర్ & యూనిట్ ఇన్చార్జీలకు, గ్రామ అధ్యక్షులకు , బూత్ కన్వీనర్లుకు, ముఖ్యంగా అన్ని క్లస్టర్లలో మహిళలకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఇంచార్జి పిలుపునిచ్చారు.

## 29 వార్డు డ్రైనేజ్ మురుగు కాలువల సమస్యలను పరిష్కరించండి :సిపిఐ సహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు నగరంలోని 29వ వార్డులో సమస్య లు పరిష్కరించాలని సిపిఐ నగర సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు డిమాండ్ చేశారు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 29వ వార్డులో సప్తగిరి కాలనీ సాయినాథ్ నగర్, బాలాజీ నగర్ లలో మురుగునీరు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయాలని డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు గురువారం నాడు 29వ వార్డుల సమస్యలు తెలుసుకునేందుకు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో వార్డులో పర్యటించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు మాట్లాడుతూ 29వ వార్డులోనే బాలాజీ నగర్, సాయినాథ్ నగర్,సప్తగిరి కాలనీలో మురుగునీరు రోడ్డులో ప్రవహించి వచ్చిపోయే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతావున్నారు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల రోడ్డుపైన మురుగునీళ్లు ఆగి దోమలకు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడమే కాకుండా మురుగునీరు దోమలకు నిలయలుగా మారి స్థానిక ప్రజలు తరచూ డెంగ్యూ, మలేరియా, స్కిన్ ఎలర్జీ లాంటి అనారోగ్యానికి గురవుతున్నారని కావున ఈ కాలనీలో వెంటనే డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమస్యపై మున్సిపల్ అధికారుల స్పందించకపోతే సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీం లక్ష్మి గణేష్ రెడ్డి ఆర్కే నాయుడు సుధాకర్ నారాయణమ్మ మొదలగువారు పాల్గొన్నారు.

# నందమూరి తారక రామారావుకి నివాళులర్పించిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 103 జన్మదినాన్ని పురష్కరించుకొని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ఉదయం 6 గంటలకు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం ఆవరణలో ఉన్నటువంటి యన్.టి.ఆర్. విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి గటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ యన్.టి. రామారావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమునకు ముందు తెలుగు చలన చిత్ర రంగంలో తిరుగులేని కథానాయకుడిగా పేరు ప్రఖ్యాతులు సాధించారు. తాను యన్.టి.ఆర్. అభిమానిగా ఉన్న సమయంలరో 1982 మార్చిలో తెలుగుదేశంపార్టీని స్థాపించిన సమయంలో వారి సమక్షంలో పార్టీలో చేరి ఈ రోజు ఇంతటి గుర్తుర్తింపును సంపాదించుకున్నానంటే యన్.టి.ఆర్. స్ఫూర్తి కారణమనీ, యన్.టి.ఆర్. పార్టీకి పునాదులు వేస్తే నారా చంద్రబాబునాయుడు నారా లోకేష్ అనాటి పునాదులపై పటిష్టమైన పార్టీ నిర్మాణం చేసి ఈ రోజు దేశంలో ఒక ప్రాంతీయ పార్టీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొని వస్తున్నారనీ, యన్.టి.ఆర్. ఆశయాల సాధనకోసం కృషిచేస్తునారనీ గుర్తుచేశారు. రాష్ట్రంలో గత 5 సంవత్సరాలలో కొనసాగించిన అరాచకపాలనకు చరమగీతం పాడి, తిరిగి రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొని రావడంలో చంద్రబాబునాయుడు ప్రణాళికలను రూపొందిస్తే ప్రజాక్షేత్రంలోకి యువగళం పేరుతో ముందుకు వెళ్లి నారశ నిస్పృహలో ఉన్నటువంటి రాష్ట్ర ప్రజలకు ధైర్యాన్ని నింపి ప్రజలలో మార్పును తీసుకొని వచ్చి రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషిచేశారనీ ఆయన గుర్తుచేశారు. యన్.టి.రామారావు పార్టీని స్థాపించిన 9 మాసాలకే అధికారంలోకి తెస్తే వెన్నుపోటు కారణంగా ప్రజాస్వామ్యం ఖూని అయింది. తిరిగి నెలరోజులలో అధికారాన్ని చేపట్టి ప్రజాస్వామ్య పరిరక్షణకు దోహదపడ్డారనీ, ఆనాడు రాష్ట్రంలోని ప్రజలు యన్.టి.ఆర్. కి అండగా నిలబడి వెన్నుపోటు కాంగ్రేస్కు బుద్ధిచెప్పారనీ తెలిపారనీ, అయితే నేడు రాష్ట్రంలో వై.సి.పి. పార్టీ నాయకులు, ముఖ్యంగా జగన్మోహన్రెడ్డి అప్రజాస్వామిక విధానాలను నారా లోకేష్ ప్రతగటిస్తూ పార్టీని కాపాడటంలో కీలక పాత్రపోషిస్తూ తండ్రికి తగ్గ తనయుడుగా, తాతకు తగ్గ మనుమడుగా పార్టీ కొరకు కృషిచేస్తున్నారనీ, పార్టీలో కొనసాగుతున్నందుకు ఎంతో గర్వంగా ఉందనీ, రాష్ట్రంలో పశు పు జెండా పదికాలలపాటు పచ్చగా ఉండాలనీ మనస్ఫూపర్తిగా కోరుకుంటున్నాను.




## డిజిటల్ మహానాడు విజయవంతం.. ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** సామాన్య కార్యకర్తలను సైతం నాయకులను చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో రెండవ రోజు నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన ఎంపీ, అనంతరం కేక్ కట్ చేసి నాయకులకుతినిపించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదుపు చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడు లో రికార్డు స్థాయిలో లక్షల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహానాడును విజయవంతం చేసారన్నారు..బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆనాడు ఎన్.టి.రామారావు తెలుగుదేశం పార్టీ ని స్థాపించారని,టీడీపీ తోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు.. కార్యకర్తలను కుటుంబ సభ్యులగా భావించే పార్టీ టీడీపీ అని, సామాన్య ఎం.పి.టి.సీ గా ఉన్న తనను ఎంపీ గా చేసిందన్నారు...ఇక మహానాడు లో కర్నూలు హై కోర్టు బెంచ్ ఏర్పాటు తో పాటు , మహిళలకు 33 శాతం రిజర్వసన్లకు తీర్మానం తెలపడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు...ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రెండేళ్లలో ఊహించని అభివృద్ధి చేశాం





## కర్నూలును పారిశ్రామికంగా ముందుకు తీసుకెళుతున్నాం రెండవ రోజు మహానాడులో మంత్రి టీజీ భరత్ గుప్తా

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** తమ ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఊహించని విధంగా అభివృద్ధి చేశామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. రెండవ రోజు నగరంలోని వివిధ క్లస్టర్లలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ దేశం గర్వించదగ్గ నాయకుడు అన్నారు. ఆయన అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శవంతంగా నిలిచాయన్నారు. తెలుగు జాతి ఎన్టీఆర్‌ను ఎన్నటికి మర్చిపోదని కొనియాడారు. ఇక ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో పేదలకు అన్నివిధాలా అండగా ఉంటున్నామన్నారు. పింఛన్ల పంపిణీ, తల్లికివందనం పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చుతాయన్నారు. అన్న క్యాంటిన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నట్లు తెలిపారు. కర్నూలు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. మునుపెన్నడూ లేనివిధంగా ఓర్వకల్లుకు భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదలకు ఎంతో ఉపయోగపడే కర్నూలు ప్రభుత్వాసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కర్నూలును స్మార్ట్ చేసేందుకు అహర్నిశలు కష్టపడుతున్నానన్నారు.

నగరంలో ఇప్పటివరకు 850పైగా కొత్త విద్యుత్ స్తంభాలు అమర్చినట్లు చెప్పారు. 40కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చామన్నారు. సమస్య ఉందని తెలిసిన వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. గతంలో తక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై పోరాడినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వై.ఎస్ జగన్ చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలన అరాచకంగా సాగిందని, ప్రజలు మెచ్చేవిధంగా తమ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. పుట్టినరోజులకు సేవా కార్యక్రమాలు చేసే సంస్కృతి తమదైతే.. రోడ్లపై ఫ్లెక్సీలకు పొట్టేళ్ల రక్తం చిందించేది వైసీపీ నైజం అన్నారు. వైసీపీ విధానాలు ప్రజలందరికీ అర్థమవుతున్నాయన్నారు.

# జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు





## ఎన్టీ రామారావు కి భారతరత్న ఇవ్వాలి గుడిసె ఆది కృష్ణమ్మ, జిల్లా టిడిపి నాయకుల డిమాండ్.

**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పార్లమెంటు అధ్యక్షురాలు గుడి కృష్ణమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 103వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ కర్నూలు పార్లమెంటు సభ్యులు శ్రీ బస్తిపాటి నాగరాజు గారు ముఖ్య అతిథులుగా హాజరు కాగా పార్టీకి చెందిన వివిధ స్థాయిల నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు హాజరు కాగా ముందుగా పార్టీ కార్యాలయం ఆవరణ యందు, కార్యాలయంలోనూ కీర్తిశేషులు ఎన్టీఆర్ గారి విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కేకును కట్ చేసి ఒకరికొకరు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు .తరువాత జిల్లా పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్నటువంటి ఎన్టీఆర్ గారి విగ్రహం దగ్గరకు చేరుకొని అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తదుపరి నాయకులు మాట్లాడుతూ శ్రీ నందమూరి తారక రామారావు గారు ఒక వ్యక్తి కాదు ఒక శక్తిని వారు 1983 వరకు తెలుగు చలనచిత్ర రంగంలో మా కుటుంబం లేని కథానాయకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితిని దృష్టిలో ఉంచుకొని ఆనాడు రాష్ట్రంలోని కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీ కాంగ్రెస్ వారికి పాదాక్రాంతులై పదవుల కోసం వెంపర్లాడు తున్నారు వారి దయాదాక్షిన్యాలతో రాష్ట్రంలో పాలన కొనసాగిస్తూ తోచిన కాడికి వారు రాష్ట్ర ఖజానాను సమూలంగా దోచేసి రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేశారు ఇలాంటి సమయంలో తెలుగు వారి ఆత్మ గౌరవం నినాదంతో ఎన్టీ రామారావు గారు 1982 మార్చ్29న తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల పాటు రాష్ట్రంలో కలియతిరిగి 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పేకలించి వేశారని, మొట్టమొదట కాంగ్రెస్ ఇతర ముఖ్యమంత్రిగా శ్రీ ఎన్టీఆర్ గారు ప్రజల సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారని ఆనాడు రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన నిజాయితీపరుడైన నాయకుడు పేదవాడి కోసం బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అలాంటి మహనీయుని వల్ల ఈరోజు రాష్ట్రంలో ఎంతోమంది ఎస్సీ ఎస్టీ బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు అత్యున్నత పదవులను పొందేందుకు ఎన్టీఆర్ మార్గదర్శకులుగా నిలిచారని వారు ఆనాడు సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళుగా భావించి ఆ నిరుపేద దేవుళ్లకు కూడు, గూడు,గుడ్డ , అనే మూడింటిని ప్రజలకు అందించారు.పట్టెడన్నం పెట్టేందుకు రెండు రూపాయలకు కిలో బియ్యం ఉండేందుకు గూడు అక్క గృహము, కట్టుకునేందుకు గుడ్డ జనతా వస్త్రాలను అందించి పేదలపాలికి దేవుడయ్యారని గుర్తు చేశారు. ఆనాడు మహిళలకు సమాజంలో సమాన స్థానం కల్పించాలని ఉద్దేశంతో మహిళలకు సమాన హక్కు రిజర్వేషన్లను అమలు కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ . అలాంటి మహనీయునికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే భారతరత్న ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ అడుగుజాడల్లో పార్టీని ముందుకు తీసుకొని వెళుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని నారా లోకేష్ మహిళల కోసం రానున్న ఎన్నికల్లో మహిళా బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన పొందకపోయినా 33% రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు జరిపే ప్రయత్నంలో భాగంగా మహిళలకు స్థానం కల్పించనున్నట్లు తెలియజేశారని , గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని మహానాడు సందర్భంగా నారా లోకేష్ తెలియజేసినందుకు ఈ సందర్భంగా వారికి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలియజేయ జరిగిందఈరోజు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకొనుచున్న ముస్లిం సోదరులకు ఈ సందర్భంగా కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ తరఫున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు యాదవ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి వి.రాజశేఖర రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నంద్యాల నాగేంద్ర, కొంకటి లక్ష్మి నారాయణ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి నంది మధుసుధన్ నాయుడు, శ్రీయుతులు సత్రం రామక్రిష్ణుడు, పి.హనుమంతరావు చౌదరి, వై.నరసిమ్హులు, ఎల్లప్ప, రవి చంద్ర శర్మ, కె.చంద్రకాంత్, బాబు రావు, బాల వెంకటేశ్వర రెడ్డి, నాగరాజు, గున్నా మార్క్, లక్ష్మన్ రావు, నాగార్జున చౌదరి, ఉపేంద్ర, భాస్కర్ రెడ్డి, రామక్రిష్ణ మొదలగు వారితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహానాయకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన... సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు..

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** మహానాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గురువారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మే 28వ తేదీని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.ఈ సంధర్భంగా సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ యం. మహేష్ కుమార్ మాట్లాడుతూ... తెలుగు ప్రజల గౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహానాయకుడు ఎన్టీఆర్ ప్రజాహిత పరిపాలనకు ప్రతీక అని పేర్కొన్నారు.ప్రజలకు అందించిన సేవలు, ఆయన పరిపాలనా దక్షత, తెలుగు సమాజానికి చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో హోంగార్డు డిఎస్పీ ప్రసాద్, ఆర్ ఐలు నారాయణ, పోతల రాజు, ఆర్ ఎస్సైలు , ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# బక్రీదు పండుగకు పటిష్ట భద్రత.

## గురువారం బక్రీదు పండుగ సందర్భంగా దర్గా, మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.



# ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు

## రూ.1.17 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీ.జీ. భరత్ శంకుస్థాపన



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల పనులను చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి వివిధ వార్డుల్లో రూ.1.17 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. 22, 23, 24, 25వ వార్డుల్లో రూ.35.40 లక్షలతో సీసీ రోడ్లు, హెచ్‌డీపీఈ పైప్‌లైన్లు, కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. 42, 43, 45, 46వ వార్డుల్లో రూ.65.25 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పార్కు అభివృద్ధి, పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 47, 48, 50, 52వ వార్డుల్లో రూ.16.99 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతులు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని ఆరు పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రతి పార్కులో వాకింగ్ ట్రాక్, గ్రీనరీతో పాటు ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరలోనే పెద్దఎత్తున డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపడతామన్నారు. గత రెండు రోజుల్లో దాదాపు రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని, నెల రోజుల్లోపు అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



# జగన్ పీఏ కేఎన్ఆర్ నివాసంలో సిట్ తనిఖీలు



ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్) నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తనిఖీలు చేపట్టింది. మద్యం లావాదేవీలకు సంబంధించి విజయవాడలోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, సిట్ కార్యాలయంలో కేఎన్ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆయనను ప్రశ్నిస్తున్నారు. బుధవారం కూడా కేఎన్ఆర్‌ను సిట్ అధికారులు దాదాపు 9.5 గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. విచారణలో ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం.సిట్ దర్యాప్తులో కేఎన్ఆర్ ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆమె బ్యాంకు ఖాతాలో 2019-24 మధ్య సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. వీటికి తోడు విజయవాడలో ఒక కార్ షోరూంలో వాటా, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కేఎన్ఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనూహ్యంగా ఆస్తులు కూడబెట్టిన కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఒకవైపు విచారణ కొనసాగుతుండగానే, మరోవైపు నివాసంలో సోదాలు జరగడం ఈ కేసులో తీవ్రతను తెలియజేస్తోంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# బడుగు, బలహీన, పేద వర్గాల అభ్యున్నతికి స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయం



### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

### తెలుగువారి ఆత్మ అభిమానం కాపాడిన ఎన్టీఆర్

### ఆదోని శాసనసభ్యులు పార్థసారధి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**బడుగు, బలహీన, పేద వర్గాల అభ్యున్నతికి స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయం అని, వారిని ఆదర్శంగా తీసుకొని సమాజానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.గురువారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జన్మదిన వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జ్యోతి ప్రజ్వలన గావించి ఎన్ టి రామారావు చిత్రపటానికి పూలమాల సమర్పించి జన్మదిన వేడుకలు ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ.. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు కృష్ణాజిల్లా నిమ్మకూరు లో సాధారణ కుటుంబంలో 1923 మే 28 న జన్మించారని తెలిపారు.నట జీవితం ప్రఖ్యాతిగాంచిందని , 1949లో మనదేశం సినిమా తో సినీ జీవితం ప్రారంభించారని , స్త్రీ పాత్రలు కూడా వేశారని , దాదాపు 300 సినిమాలలో నటించారని , దర్శకునిగా , నిర్మాతగా రాణించారని , నర్తనశాల సినిమా కొరకు 40 సంవత్సరముల వయసులో కూచిపూడి నాట్యం నేర్చుకున్నారని తెలిపారు. ఇది ఆయన అకుంటిత దీక్షకు నిదర్శనమని తెలిపారు. రాజకీయ జీవితం 1982లో మొదలుపెట్టి 75 వేల కిలోమీటర్లు చైతన్య రథంలో సమైక్య ఆంధ్ర రాష్ట్రమంతా పర్యటనలు చేశారని తెలిపారు.ఈ పర్యటనలలో రోడ్డు పక్కనే చెట్ల క్రింద విశ్రాంతి తీసుకోవడం , భోజనం చేయడం చేశారని ఆ విధంగా రాష్ట్ర ప్రజలకు దగ్గరయి మనసు దోచుకున్నారు. 1983 ఎన్నికలలో అఖండ విజయం సాధించి తద్వారా ప్రభుత్వాన్ని స్థాపించి ప్రజలకు మంచి ప్రయోజనాలు కల్పించారని అందులో రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం,ఆడపిల్లలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు , మండల వ్యవస్థ తీసుకుని వచ్చి ప్రజల వద్దకే పాలన తెచ్చారని తెలిపారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ఎన్నో కార్యక్రమాలు ప్రజల కొరకు చేశారని తెలిపారు.మద్యపాన నిషేధాన్ని తీసుకొని వచ్చారని , పేదల కొరకు ఇండో అమెరికా క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు , పేదలకు ఇల్లు , చౌకగా జనతా వస్త్రాలు , పెన్షన్ మొదలగు సౌకర్యాలు కల్పించారని తెలియజేశారు. ఎన్టీఆర్ సేవలకు గుర్తుగా హైదరాబాదులో ఎన్టీఆర్ గార్డెన్ గా పేరు పెట్టడం జరిగిందని అలాగే నవ్యాంధ్రప్రదేశ్ లో ఒక జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు.ఎన్టీఆర్ ప్రజల కు చేసిన సేవలను మనమందరం ఆదర్శంగా తీసుకొని తమను తాము అభివృద్ధి చేసుకొని ప్రజాసేవకు అంకితం కావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆదోని శాసనసభ్యులు పార్థసారథి ప్రత్యేక అతిథిగా ఉపన్యాసం చేస్తూ.నందమూరి తారకరామారావు తెలుగువారి ఆత్మాభిమానాన్ని కాపాడిన వ్యక్తి అని తెలిపారు. నందమూరి తారక రామారావు ఆంధ్రప్రదేశ్ కు మరియు దక్షిణ భారతదేశానికి సుపరిచితులైన ఆదర్శ మూర్తి అని తెలిపారు. పద్మశ్రీ , డాక్టర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ బిరుదులు సాధించిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ప్రజాసేవ కొరకే రాజకీయాలలోకి ఎన్టీఆర్ వచ్చారని ఆయనను ఆదర్శంగా తీసుకొని ఎంతోమంది నటులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేస్తూ ఉన్నారని , ఈ మధ్య తమిళనాడులో కళాకారుడు విజయ్ ముఖ్యమంత్రి కావడం జరిగింది అని తెలియజేశారు. ఎన్టీఆర్ చైతన్య రథంలో 9 నెలలు ఆంధ్రప్రదేశ్లో నిర్విరామంగా ప్రయాణించి ప్రజలను చైతన్యపరిచి ఎన్నికల్లో విజయం సాధించి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యారని ఈ విధంగా తన పోరాటాన్ని కొనసాగించి మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారని సరికొత్త పథకాలు పెట్టి ప్రజల మన్నలను పొందారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాలలో తెలుగు ప్రజలు ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరుపుకుంటున్న విషయం మనం గమనిస్తున్నామని తెలిపారు. తెలుగువారి ఆత్మ అభిమానం కాపాడారని ఆ విషయములో తగ్గకుండా రాజకీయం చేశారని తెలిపారు ఎన్టీఆర్ అడుగుజాడలలో ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , బాలకృష్ణ , నారా లోకేష్ , పురందేశ్వరి మొదలగువారు రాజకీయాల్లో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ప్రజలకు ఉపయోగపడే విప్లవాత్మక పథకాలు ఎన్నిటినో తీసుకుని వచ్చారని మహిళలకు ఆస్తిలో హక్కు, పేదలకు గృహాలు , రెండు రూపాయలకే కిలో బియ్యం లాంటి సంక్షేమ పథకాలు , ప్రజల ఆరోగ్యం కొరకు ఆసుపత్రులు ఇందులో ఉన్నవని తెలిపారు. జిల్లా ప్రజలందరికీ ఉపయోగపడే భవనం మనం ఇప్పుడు ఉన్న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణము 1983 లో ఎన్ టి రామారావు చే ప్రారంభించబడిందని తెలిపారు.కావున ఎన్టీఆర్ ను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ. దేశభాషలందు తెలుగు లెస్స అన్న కృష్ణదేవరాయల మాటలకు నిలువుటదంగా ఎన్టీఆర్ నిలిచారని తెలిపారు.1986 జనవరి 1న తాను ( పత్తి ఓబులయ్య ) రచించిన " తెలుగు భోజుడు " పుస్తకాన్ని ఎన్టీఆర్ చే ఆవిష్కరింపబడి ఆయన మన్నులను పొందిందని ఎన్టీఆర్ తో తనకున్న అనుభవాన్ని తెలిపారు. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీఆర్ తో కలిసి తెలుగంగ ప్రాజెక్టును ప్రారంభించి కర్నూలు నుండి నెల్లూరు వరకు తెలుగు ప్రజలకు త్రాగునీరు , సాగునీరు అందించి పొలాలను సస్యశ్యామలం చేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కెసి కెనాల్ , రైతు బజారు ను శుభ్రపరచడం మరియు సి - క్యాంప్ సెంటర్ లో ట్రాఫిక్ ను నియంత్రణ చేయడంలో కృషిచేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి కి ధన్యవాదాలు అభినందనలు తెలియజేశారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి సెట్కూర్ సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ 1923 సంవత్సరం మే 28 న జన్మించారని , సాధారణ కుటుంబంలో జన్మించి ఆయన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ గా మారి సమైఖ్య ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి గా ప్రజలకు గణనీయమైన సేవలు అందించారని ఎన్టీఆర్ ఉద్యోగం, సినీ , రాజకీయ జీవన ఘటనలను విపులంగా తెలిపారు.ఎన్టీఆర్ ను స్ఫూర్తిగా తీసుకొని చిన్నప్పటినుండి రంగస్థలానికి అనుబంధం ఏర్పడి నాటకాలు వేసే వాడిని అని నాటక రంగానికి సినిమా రంగానికి గల తేడాను డీఈవో నాగరాజు రాగయుక్తంగా ఈ సందర్భంగా వివరించారు. తెలుగువారి ఆత్మభిమానానికి చిహ్నంగా , శక్తి గా ఎన్టీఆర్ నిలిచారని , కోట్లాది తెలుగు ప్రజల స్వాభిమానం కొరకు పోరాటం చేశారని వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ తెలియజేశారు.రామునిగా , కృష్ణునిగా పాత్రలు పోషించిన ఎన్టీఆర్ ప్రజల మనసులో ఇప్పటి ఉన్నారని, 1982 లో కొత్త పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయ్యి అప్పుడు ఆయన ఏర్పాటు చేసిన మండల వ్యవస్థ , రెండు రూపాయల కిలో బియ్యం ఇప్పటికి కొనసాగుతున్నాయని అందుకే ఇప్పటికి ఆయనను గుర్తు చేసుకుంటున్నామని కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్ తెలియజేశారు.మెప్మా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ. ఎన్టీఆర్ గొప్ప సంఘసంస్కర్త అని రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేశారని దక్షిణ భారతదేశంలో ఎన్టీఆర్ ని దేవునిగా చూస్తారని , 1982లో పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయ్యారని కళాకారులందరూ ఎన్టీఆర్ ని గౌరవిస్తారని తెలిపారు.ఈ సందర్భంగా " దానవీరశూరకర్ణ " సినిమా లోని ఏకపాత్రాభినయం మరియు సంఘటనలు వివరించారు.

ఈ కార్యక్రమంలో అహమ్మద్ మియా పాడిన పద్యాలు,గజల్స్ , ప్రభుత్వ శారద సంగీత కళాశాల విద్యార్థులు , సిద్దేంద్ర నాట్య మందిరం వారు చేసిన కూచిపూడి, భరతనాట్య నృత్య రూపకాలు ఆహుతులను అలరించాయి. వీరిని అతిధులు మెమొంటోలు ఇచ్చి సత్కరించారు.ఈ కార్యక్రమానికి టి. జి. వి. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబుళయ్య , ఎక్సైజ్ సూపరిండెంట్ సుధీర్ బాబు , సీఈవో సెట్కూర్ వేణుగోపాల్, రీజనల్ టూరిజం అధికారి లక్ష్మినారాయణ , డీఈవో నాగరాజు ,ఎస్ఎస్ఏ ఏపీసి లోకరాజు,ఆర్డిఓ సందీప్ కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి,ఎన్.హెచ్ ఎస్డిసి సునీత బాయి,డిపిఓ భాస్కర్ , మెప్మా పీడీ శ్రీనివాసులు, తాహసీల్దారులు రమేష్, రవి,వెంకటేష్ నాయక్, సి.పి.ఓ. ఆఫీస్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వెంకటరమణ మొదలగు అధికారులు హాజరు అయ్యారు.



## యుగపురుషుడు..దివ్యంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు

### మాజీ కల్లూరు సింగల్ విండో అధ్యక్షులు మల్లెల పుల్లారెడ్డి



**కల్లూరు నంది పత్రిక....** పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా తెలుగు దేశం పార్టీని స్థాపించడం జరిగిందని మాజీ కల్లూరు సింగల్ విండో అధ్యక్షులు మల్లెల పుల్లారెడ్డి పేర్కొన్నారు. స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని ఁ జంక్షన్ నందు దివంగత నేత ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. మాజీ ఎంపీపీ పెద్ద హమీన్, 30వ వార్డు మాజీ కార్పొరేటర్ జయరాముడు, బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ మధుసూదన్, కల్లూరు నాయకులు రాఘవాచారి, చంద్రప్ప, శ్రీనివాసులు, పెద్దపాడు గ్రామ నాయకులు కల్లె శివ నారాయణ, కల్లె చిన్న ఈశ్వరయ్య, పుసు లూరు ఆనంద్ రెడ్డి, =.కోటేశ్వర్ రెడ్డి, మౌలాలి, రఘురామిరెడ్డి, వాసవి నగర్ నాయకులు ఎం విశ్వనాథ్, వెంకట నాయుడు, రిటైర్డ్ లెక్చరర్ వెంకటేశ్వరరావు, శివారెడ్డి, విజయకృష్ణ,కేతవరం పరమేశ్వరుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక నేతలు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికార పీఠం కైవాసం చేసుకొని కాంగ్రెస్ పార్టీకి దీటైన నేతగా నిలిచా రన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, మహిళా రిజర్వేషన్ వంటి పథకాలు అమలు చేసి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన నాయకుడు అని కొనియాడారు. ప్రతి గ్రామస్థాయి నుండి ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు ముందుకు వచ్చిన ఘనత కూడా ఆయనదేనన్నారు. అన్ని వర్గాల వారికి ఎన్నికల్లో పోటీలో నిలిచింది సీట్లు ఇచ్చి గెలిపించిన ఘనత కూడా ఎన్టీఆర్ ది అన్నారు. సినీ ప్రపంచంలో తిరుగులేని హీరోగా నిలిచారన్నారు. ప్రపంచ నలుదిక్కుల తెలుగు వారి ఖ్యాతిని చాటిన మహోన్నత వ్యక్తి అన్నారు. అతి తక్కువ సమయంలోనే వెలుగోడు జలాశయం నుండి తెలుగుగంగ కాలువ పూర్తిచేసి రైతులకు సాగు నీరు, తమిళనాడు ప్రజలకి తాగునీరు అందించిన ఘనత కూడా ఎన్టీఆర్ కే దక్కిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి తెలుగుదేశం పార్టీ ద్వారానే రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు ఊపు అందుకున్నాయని పుల్లారెడ్డి స్పష్టం చేశారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

### తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరస్మరణీయ ప్రతీక ఎన్టీఆర్

### డిఆర్ఓ రాము నాయక్



**నంద్యాల బ్యూరో, మే 28(నంది పత్రిక):-** నటసార్వభౌముడు, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారక రామారావు గారి 103వ జయంతి వేడుకలు గురువారం నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, జిల్లా పర్యాటక అధికారి విజయలక్ష్మి తదితర అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ.. తెలుగు సినీ, రాజకీయ రంగాలలో ఎన్టీఆర్ గారు సృష్టించిన ప్రభంజనం చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వెండితెరపై తన అపూర్వ నటనతో కోట్లాది అభిమానుల హృదయాలను గెలుచుకున్న ఎన్టీఆర్, రాజకీయాల్లో ప్రజాహిత పాలనతో తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో ఆయన పోషించిన పాత్రలు తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ముఖ్యంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి దైవిక పాత్రల్లో ఆయన నటన ప్రజల హృదయాల్లో దైవసమాన స్థానం సంపాదించిందన్నారు. ఏ పాత్ర పోషించినా దానిలో జీవించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగల మహానటుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. 1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించిన ఎన్టీఆర్ గారు సాధారణ కుటుంబం నుంచి వచ్చి తన అసాధారణ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతికి గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కళారంగాన్ని ఎంచుకోవడం ఆయన సంకల్పబలానికి నిదర్శనమన్నారు. 1949లో విడుదలైన "మనదేశం" చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన ఎన్టీఆర్, అనంతరం అనేక చారిత్రక, పౌరాణిక, సామాజిక చిత్రాలలో అజరామర పాత్రలు పోషించి తెలుగు చలనచిత్ర చరిత్రలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. నటుడిగానే కాకుండా ప్రజానాయకుడిగా కూడా తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహానుభావుడు ఎన్టీఆర్ అని డిఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

## తెలుగు జాతి గర్వకారణమైన మహానటుడునందమూరి తారక రామారావు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి , ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు కార్యాలయ ప్రాంగణంలో తెలుగు జాతి గర్వకారణమైన మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ప్రజా సంక్షేమం, తెలుగు సంస్కృతి అభివృద్ధి మరియు ప్రజాసేవలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. నందమూరి తారక రామారావు విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రకటించింది.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయం, కర్నూలుకు చెందిన అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## బక్రీదు పండుగ సందర్భంగా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు....

### భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ...



**నంద్యాల క్రైం, మే28( నంది పత్రిక):-** నంద్యాల జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగ సందర్భంగా దర్గా, మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భద్రత ఏర్పాట్లలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యమైన ప్రాంతాలలో పికెట్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నంద్యాల పట్టణం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈద్గాల వద్ద ముస్లిం సోదరులతో మాట్లాడుతూ పరిస్థితులపై ఆరా తీశారు అనంతరం వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్పీ ఎం జావళి, తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### "వన్ మంత్ - ఫోర్ విజిట్"లో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**నంద్యాల బ్యూరో, మే 28(నంది పత్రిక):-** వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నేడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని కలెక్టర్ వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# ఎన్టీఆర్ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

**ఆళ్లగడ్డ తాలూకాలో మహానాడు విజయవంతం**

**స్వర్గీయ ఎన్టీఆర్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలి, యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలి**

**పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు**



**ఆళ్లగడ్డ,ప్రతినిధి మే 28నంది పత్రిక** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పది చోట్ల నిర్వహించిన టిడిపి మహానాడు కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక డాక్టర్ రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో చివరి రోజు గురువారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు103 జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుజాతికి, తెలుగు రాష్ట్రాలకు ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రజా సంక్షేమమని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడేది తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ సందర్భంగా అన్నారు. మహానాడు కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం. మహానాడు ను విజయవంతం చేసినందుకు తాలుకా లోని టిడిపి నాయకులకు ,కార్యకర్తలకు ఎమ్మెల్యే అఖిలప్రియ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంత, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష, డాక్టర్ రాంగోపాల్ రెడ్డి, చింతకుంట రామ్ శేఖర్ రెడ్డి, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, నాగాంజనేయులు, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి బీరువాల భాస్కర్, ప్రసాద్ రాజు, నాగిరెడ్డి,అలాగే మండలంలోని బాచేపల్లి గ్రామంలో నిర్వహించిన మహానాడులో మండల టిడిపి కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, తెదేపా నాయకులు వెంకట శివారెడ్డి, మిట్టపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బక్రీద్ వేడుకలు



**ఆళ్లగడ్డ, ప్రతినిధి మే 28నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలో, మండలంలోని గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆళ్లగడ్డ మండలం ప్రభుత్వ ఖాజీ, మతపెద్ద పాత మసీదు జామియా మర్కస్ మసీద్ ఇమామ్ మహమ్మద్ జాఫర్ సాదిక్ ఆధ్వర్యంలో పట్టణంలోని మసీదుల నుండి ముస్లిం సోదరులు సామూహికంగా అల్లాహ్ అక్బర్ అల్లాహు అక్బర్ అంటూ తక్బీర్ చదువుతూ సంత మార్కెట్, పాత బస్టాండ్ మీదుగా కడప రోడ్డు లో ఉన్న లింగం దిన్నె రోడ్డు వైపున ఉన్న ఈద్గా వద్దకు వెళ్లారు. అక్కడ ముస్లిం సోదరులు అందరూ సామూహికంగా బక్రీద్ పండగ ప్రత్యేక నమాజు జమాత్ తో ప్రార్థన చేయడం జరిగింది. నమాజు తర్వాత ప్రపంచ శాంతి కోసం అల్లాతో దువా చేయడం జరిగింది. ఈ సందర్భంగా మత పెద్ద మహమ్మద్ జఫర్ సాదిక్ బక్రీద్ పండగ యొక్క ప్రాధాన్యత వివరించారు. అందరూ స్వార్థం వీడి త్యాగంతో ప్రేమతో సోదర భావంతో జీవిస్తూ సమాజ హితం కోసం పాటుపడుతూ దైవ మార్గంలో సన్మార్గంలో పయనించాలని తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరు ఆలింగణం చేసుకొని బక్రీద్ శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆళ్లగడ్డ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి అమీర్ బాషా, కోశాధికారి ఫ్రూట్స్ మండి షర్ఫుద్దీన్, మాజీ కౌన్సిలర్ హుస్సేన్ భాష, హాజీ జమాల్ వలి, మహబూబ్ బాషా చాక్లెట్ భాష, హకీం పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఆళ్లగడ్డప్రతినిధి మే 28నంది పత్రిక : నేడు ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ తో కలిసి తాను ప్రజలనుండి వినతులు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో గానీ, పట్టణంలో గానీ తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పెన్షన్లు, రేషన్, భూ సమస్యలు లేదా ఇతర ప్రజా సమస్యలు ఏవైనా ఉన్న అర్జీదారులు స్వయంగా వచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆమె కోరారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించే విధంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందవలసిందిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు.

# ఆళ్లగడ్డలో ఈనెల 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**"వన్ మంత్ - ఫోర్ విజిట్"లో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం**





**నంద్యాల, మే 28 నంది పత్రిక** వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వ తేదీ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.లి ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని కలెక్టర్ వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా విశ్వవిఖ్యాత నట సార్వభౌమ డా. నందమూరి తారక రామారావు గారి 103 వ జయంతి వేడుకలు

**యర్రగుంట్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ.**



**శిరివెళ్ల (నంది పత్రిక):-** తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహానాయకుడు ఎన్టీఆర్ తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన యుగపురుషుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి వేడుకలు శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన మహానాడులో ఘనంగా జరిగాయి. ఎన్టిఆర్ చిత్ర పటానికి నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి, చింతకుంట్ల బూసిరెడ్డి, ఎంపిటిసి జయరామిరెడ్డి, సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాస రెడ్డి ఇతర ప్రముఖులు నాయకులుపూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కల్లూరి శకుంతలమ్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక స్టార్ హీరో మాత్రమే కాదని, భారత రాజకీయాల్లోనే వ్యవస్థను మార్చిన ఒక అసలైన "డిస్రప్టర్" (గేమ్ చేంజర్) అని కొనియాడారు. "తెలుగువాడు" అనే గుర్తింపును, పౌరుషాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిని స్మరించుకున్నారు. వెండితెరపై దేవుడిగా పూజలందుకున్న ఎన్టీఆర్, 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 'చైతన్య రథం' ద్వారా సామాన్య ప్రజల చెంతకు వచ్చి ప్రజా విప్లవానికి నాంది పలికారని అన్నారు. రూ.2 లకే కిలో బియ్యం పథకం ద్వారా పేదల ఆకలిని తీర్చడమే కాకుండా, శతాబ్దాల భూస్వామ్య పటేల్-పట్వారీ వ్యవస్థను రద్దు చేసి గ్రామీణ పేదలకు నిజమైన స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం కంటే 20 ఏళ్ల ముందే (1986లోనే) హిందూ వారసత్వ చట్టంలో కూతుళ్లకు సమాన ఆస్తి హక్కు కల్పించిన దార్శనికుడు ఎన్టీఆర్ అని అన్నారు . 1983 విజయవాడలో ప్రారంభమైన మొదటి మహానాడు సాంప్రదాయం నేటికీ క్యాడర్‌లో నిరంతర చైతన్యాన్ని నింపుతోందని, మే 28న ఆయన జయంతి వేడుకలను నిర్వహించుకోవడం తెలుగువారందరికీ ఒక సెంటిమెంట్ అని శకుంతలమ్మ పేర్కొన్నారు. సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ గారి జీవన సూత్రాన్ని ఆదర్శంగా తీసుకుని, సమాజ సేవకు, సంక్షేమానికి పునరంకితం కావడమే మహానాయకుడికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని కల్లూరి శకుంతలమ్మ అన్నారు.

## చల్లని పానీయం... నిశ్శబ్ద విషం! కూల్‌డ్రింక్ వెనుక దాగున్న చీకటి నిజాలు

వేసవి కాలం వచ్చిందంటే చాలు, భానుడి భగభగలకు గొంతు ఎండిపోతుంది. అటువంటి తరుణంలో చల్లగా, ముచ్చటగా మెరిసిపోయే ఒక కూల్‌డ్రింక్ సీసా చేతిలోకి వస్తే? ఆ పచ్చటి లేదా నల్లటి శీతల పానీయాన్ని గటగటా తాగుతుంటే, మొదటి గుక్కలోనే వచ్చే "ఆహ్!" అనే అనుభూతి ఒక స్వర్గానందాన్ని ఇస్తుంది. మనసుకు ఎంతో హాయిగా, ప్రశాంతంగా అనిపిస్తుంది. కానీ, రంగురంగుల లేబుళ్లతో, ఆకర్షణీయమైన ప్రకటనలతో మనల్ని మంత్రముగ్ధులను చేసే ఆ ఒక్క కూల్‌డ్రింక్ సీసా మన శరీరంలోకి ప్రవేశించిన క్షణం నుండి బయటకు వెళ్ళేంతవరకూ ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తుందో మీకు తెలుసా? గ్లామర్ ప్రపంచపు తెర వెనుక దాగున్న ఆ చీకటి యాత్రను, మన అంతర్గత అవయవాల రోదనను ఒక్కసారి లోతుగా పరిశీలిస్తే బహుశా మీరు మళ్ళీ ఆ రసాయనాల సీసాను అంత తేలిగ్గా చేతిలోకి తీసుకోరు.పరిశోధనలు తేల్చిన ఒక భయంకరమైన సత్యం ఏమిటంటే ఒక్క కూల్‌డ్రింక్ క్యాన్‌లో సుమారు 10 నుండి 12 చెంచాల చక్కెర ఉంటుంది. ఇది ఒక సగటు మనిషికి రోజంతా అవసరమయ్యే గరిష్ట చక్కెర మోతాదు కంటే రెట్టింపు కంటే ఎక్కువ!మీరు ఆ చల్లని పానీయాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు, మీ లోపల ఒక నిశ్శబ్ద తుఫాను మొదలవుతుంది. ఆ కాలక్రమ పట్టికను ఒకసారి చూద్దాం.0 10 నిమిషాలు (చక్కెర వరద) మీరు కూల్‌డ్రింక్ తాగిన వెంటనే, దాదాపు 150200 మిల్లీలీటర్ల ద్రవంలో కరిగిన 39 నుండి 42 గ్రాముల చక్కెర నేరుగా మీ రక్తంలోకి దూసుకుపోతుంది. సాధారణంగా ఇంత చక్కెరను ఒకేసారి తీసుకుంటే శరీరానికి వికారం కలిగి వాంతి రావాలి. కానీ కూల్‌డ్రింక్‌లో తెలివిగా కలిపిన ఫాస్ఫోరిక్ యాసిడ్ ఆ వికారాన్ని అణచివేస్తుంది. ఇది కంపెనీలు కనిపెట్టిన మైండ్ బ్లోయింగ్ కెమిస్ట్రీ కానీ మీ ప్రాణాల మీదికి తెచ్చే ముప్పు!10 20 నిమిషాలు (ఇన్సులిన్ హడావుడి) బ్లడ్ షుగర్ లెవెల్స్ రాకెట్ లాగా దూసుకుపోతాయి. కాలేయం అత్యంత అప్రమత్తమై, ఈ చక్కెర దాడిని తట్టుకోవడానికి ఇన్సులిన్ హార్మోన్‌ను విపరీతంగా విడుదల చేస్తుంది. ఆ అదనపు చక్కెరనంతా కొవ్వుగా మార్చే ప్రక్రియ ఇక్కడే మొదలవుతుంది.20 40 నిమిషాలు (కెఫీన్ తాకిడి) పానీయంలోని కెఫీన్ పూర్తిగా శరీరంలోకి శోషించుకోబడుతుంది. కంటి పాపలు విస్తరిస్తాయి, రక్తపోటు (బిపి) పెరుగుతుంది. మెదడులోని నిద్రమత్తు వదిలిపోయి, ఒక్కసారిగా ఏదో ఎనర్జీ వచ్చినట్లు భ్రమ కలుగుతుంది.40 60 నిమిషాలు (డోపమిన్ మాయాజాలం) మెదడులోని ఆనంద కేంద్రాలు సక్రియమవుతాయి. 'డోపమిన్' అనే హార్మోన్ విడుదల కావడం వల్ల మీకు ఒక రకమైన కిక్ లభిస్తుంది. నాకు ఇంకొక సీసా కావాలి అనిపించే వ్యసనపు వల ఇక్కడే పడుతుంది.60 నిమిషాల తర్వాత (క్రాష్ దశ) చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పాతాళానికి పడిపోతాయి. దాంతో విపరీతమైన అలసట, చికాకు, నీరసం ఆవహిస్తాయి. మళ్ళీ ఆ ఎనర్జీ కోసం మరో కూల్‌డ్రింక్ తాగాలనే క్రేవింగ్ మొదలవుతుంది. ఇదొక విషవలయం!ఈ పానీయాలు మన శరీరంలోని ముఖ్యమైన వ్యవస్థలను ఎలా గుల్ల చేస్తున్నాయో చూస్తే గుండె జారిపోక మానదు.కూల్‌డ్రింక్‌లో వాడే ప్రధాన స్వీటెనర్ 'హై-ఫ్రక్టోజ్ కార్న్ సిరప్' (ఎఛ్‌ఎఫ్‌సీఎస్)[?] నేరుగా కాలేయానికి చేరుతుంది.

# ఆనంద ఉత్సాహాలతో బక్రీద్ వేడుక

**ఈద్గాలలో ముస్లిం సోదరుల నమాజ్**

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే కాటసాని**







**బనగానపల్లె మే 28 నంది పత్రిక** బక్రీద్ పర్వదినాన్ని ఆనందోత్సవాల మధ్య ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్గాలలో పెద్ద ఎత్తున నమాజ్ చేశారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.బనగానపల్లె పట్టణంలో అవుకు రోడ్డు ఎస్సార్ బీసిఈద్గా లో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు నమాజ్ చేశారు .త్యాగం,ప్రేమ,సోదరభావ సందేశాన్ని చాటే ఈ పవిత్ర బక్రీదు పర్వదినం మీ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం నింపాలని షాహిదుల్లా మౌలానా అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని బనగానపల్లె పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో భారీగా ముస్లిం సోదరులు పాల్గొని నమాజ్ చేశారు. ఈ సందర్భంగా షాహిదుల్లా మౌలానామాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జరుపుకునే పండుగ బక్రీద్ అని అల్లాహ్ ఆజ్ఞ మేరకు ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధమైన సంఘటనను స్మరించుకుంటూ ఈ ప్రత్యేక దినాన్ని జరుపుకోవడం ఆచారమని చివరికి అల్లాహ్ వారి భక్తిని పరీక్షించి ఆశీర్వదించాడనే విశ్వాసం ఉంది. త్యాగ గుణాన్ని ప్రపంచానికి తెలియచెప్పిన ఈ విశిష్ట దినం నాడు అల్లాహ్ కరుణ మీ పైనా, మీ కుటుంబం పైనా ఉంటుందని అన్నారు. తమ పూర్వికుల పేరిట చాలామంది కురుబాని ఇచ్చి మాంసాన్ని బంధువులు పేదలకు పంచి పెట్టడం ఆనవాయితీ అని అన్నారు. ఎక్కువ శాతం పేదవాళ్లకు మాంసం ని అందజేయాలని అన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మబ్బులు మూలాన సహిద్ భాయ్ అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో మద్యం సేవించి వాహనం నడిపిన 1,500 మందికి 33,93,880/- జరిమాన....

**17 మందికి జైలు శిక్ష...**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**



**నంద్యాల క్రైం, మే 28(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు 01-03-2026 నుండి 28-05-2026 అనగా( మార్చి నెల నుండి మే నెల ) వరకు నంద్యాల జిల్లాలో అన్నీ పోలీసు స్టేషన్ పరిదిలలో పోలీసు అదికారులు సిబ్బందితో రోడ్డు ప్రమాదాల నియంత్రించుట కొరకు ముఖ్యమైన కూడళ్ళ వద్ద,పాఠశాలలు ,కాలేజీల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలలో మొదలగు ప్రాంతాలలో డ్రింక్ అండ్ డ్రైవ్ చెకింగ్ చేయుచుండగా చాలా మంది పట్టుబడం జరిగింది. మద్యం సేవించిన వాహనాలు నడుపుతుండగా పట్టుబడిన వారందరి నివాస స్థలము గురించి విచారించి వ్యక్తిలను స్వాధీనంలోనికి తీసుకొని స్పెషల్ రిపోర్ట్ ద్వారా ఆయా పోలీసు స్టేషన్ లలో షో ముందు హాజరుపరాచగా షో సదరు మద్యం సేవించిన వ్యక్తులపై చార్జి షీట్ దాఖలు చేసి ఆయా ప్రాంతాలలోని గౌరవ కోర్టు వారి ముందు హాజరుపరచడం జరిగింది. దీనికి కోర్టు వారు 1,500 మందికి జరిమానాలు విదించడంతో పాటు 17 మందికి జైలు శిక్షలు విదించడం జరిగింది.

**జరిమానా జైలు శిక్ష కు సంబందించిన వివరాలు:- మార్చి -- మే 2026**

**నంద్యాల సబ్ డివిజన్ :-**

నంద్యాల సబ్ డివిజన్ నందు డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసుల సంఖ్య 1190 మంది పట్టుబడగ అందులో 1187 మందికి 13,50,380/-జరిమానా విదించగ 03 వ్యక్తులకు సుమారు 15 రోజులు జైలు శిక్ష విదించడం జరిగింది.

**ఆళ్లగడ్డ సబ్ డివిజన్ :-** ఆళ్లగడ్డ సబ్ డివిజన్ నందు డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసుల సంఖ్య 139 మంది పట్టుబడగ అందులో 136 మందికి 3,73,500/-జరిమానా విదించగ 03 వ్యక్తులకు సుమారు 10 రోజులు జైలు శిక్ష విదించడం జరిగింది.

**డోన్ సబ్ డివిజన్ :-** డోన్ సబ్ డివిజన్ నందు డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసుల సంఖ్య 60 మంది పట్టుబడగ అందులో 49 మందికి 3,90,000/-జరిమానా విదించగ 11 వ్యక్తులకు సుమారు 15 రోజులు జైలు శిక్ష విదించడం జరిగింది.

**ఆత్మకూర్ సబ్ డివిజన్ :-** ఆత్మకూర్ సబ్ డివిజన్ నందు డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసుల సంఖ్య 128 మంది పట్టుబడగ వారికి న్యాయస్థానం వారు 12,80,000/-జరిమాన విధించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కళాశాలలో, పాఠశాలలో,మరియు వార్తాపత్రికల ద్వారా ప్రజలకు విధ్యార్థులకు మరియు వాహనదారులకు ,ఆటొ డ్రైవర్ లకు ఎన్నో అవగాహన కార్యాక్రమాలు చేపట్టి ప్రమాదాల నివారణకు పోలీసుల తరుపున ఎన్ని చర్యలు చేపట్టిన ప్రజలలో మార్పు రాకపోవడం వలన ఎక్కువగా జరుగుచున్నాయి. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్ర వాహనాల ద్వారా జరుగుచున్నాయి. ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించడం ద్వారా గాని, రాంగ్ రూట్ లో వెళ్ళడం ద్వార గాని,ఓవర్ స్పీడ్ ద్వార గాని ఇలా అనేక కారణాల ద్వారా ప్రమాదాలకు గురౌతున్నారు. మరి ముఖ్యంగా హెల్మెట్ దరించక పోవడం వలన చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. నంద్యాల జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు హైవేలలో జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాహన వేగాన్ని నియంత్రించడం కొరకు వివిద శాఖల సమన్వయంతో స్టాపర్ బోర్డ్స్, సిగ్నల్స్ బోర్డ్స్ ,రోడ్డుపై క్యాట్ ఐస్ మరియు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్స్ మొదలగు వాటిని ఏర్పాటు చేయడం జరిగింది. మద్యం సేవించి వాహనాలు నడపరాడు.మద్యం మనషి మెదడను తన అధీనంలోకి తీసుకుంటుంది. తాగినప్పుడు వాహనంపై కంట్రోల్ ఉండదు. మద్యం సేవించి వాహనం నడపటం ప్రమాదకరమే కాదు చట్టరీత్యా నేరం కూడా మద్యం సేవించి డ్రైవ్ చేయటం వలన డ్రైవర్లు తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టడమే కాకుండా అవతలి వాళ్ల ప్రాణాలను కూడా ప్రమాదంలో పెట్టిన వారు అవుతారు. కాబట్టి, ఎట్టిపరిస్థితుల్లోను మద్యం సేవించి వాహనం నడపరాదు. వాహన చోదకులు (డ్రైవర్స్ ) ప్రభుత్వం వారు జారీచేసిన డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయరాదు. అంతేకాక మీరు నడిపే వాహనం యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ ఇన్సూరెన్స్ మొదలైన పత్రాలు ఉంచుకోవాలి.వీలైతే మీ గుర్తింపు కార్డులు కూడా మీ వెంట ఉంచుకోవడం మంచిదన్నారు.

# త్రిలోక శోక హారిణి

## జూన్ 2 నుంచి 13 వరకు... యమునా నది పుష్కరాలు

మానవుల మనుగడలో నదులది ఎనలేని పాత్ర. ప్రపంచవ్యాప్తంగా అత్యున్నతమైన నాగరికతలు నదీ తీరాల్లోనే విలసిల్లాయి. అందుకే నదులను 'మాతృదేవతలు'గా భారతీయ సంస్కృతి ఆరాధించింది. మనుషులకు ప్రాణాధారమైన ఆ నదులకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి పుష్కరాలను నిర్వహించుకొనే సంప్రదాయాన్ని ఏర్పరచింది. దేశంలోని పన్నెండు ప్రధాన నదులను పుష్కర నదులుగా నిర్ణయించి, ఒక్కొక్క నదికీ పన్నెండేళ్ళకు ఒకసారి పుష్కరాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. గురువు ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు... ఆ రాశికి సంబంధించిన నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది కర్కాటక రాశిలో గురు ప్రవేశం సందర్భంగా... యమునా నది పుష్కరాలు జరగబోతున్నాయి. సూర్యపుత్రి, యమ సోదరి: ప్రయాగ్‌రాజ్‌లో సంగమించే త్రివేణుల్లో (మూడు నదుల్లో) ఒకటైన యమునా నదికి పౌరాణికంగానూ ఎంతో ప్రశస్తి ఉంది. శ్రీకృష్ణుని లీలా విలాసాలకు కేంద్రంగా ఈ నదిని శ్రీమద్భాగవతం రమణీయంగా వర్ణించింది. యమునను సూర్యభగవానుడి కుమార్తెగా, యముడి సోదరిగా పురాణాలు పేర్కొన్నాయి. కాబట్టి యమునా స్నానం వల్ల సూర్యానుగ్రహం లభిస్తుందని, యమ బాధలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. పుష్కర దినాల్లో సంకల్ప పూర్వకంగా యమునలో స్నానం చేసి, పిండ ప్రదానాలు, తర్పణాలు , దాన ధర్మాలు చేస్తే పితృ దేవతలు తృప్తి చెందుతారని, అభీష్టాలు సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిశంకరులు తన 'యమునాష్టకం'లో ఈ నదిని 'త్రిలోక శోక హారిణి'గా అభివర్ణించారు. ఆ అష్టకాన్ని పఠిస్తూ స్నానం చేసి, అనంతరం జపాదులు ఆచరించడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయనేది పెద్దల మాట.




**పుష్కర స్నానం చేసే ప్రదేశాలు:** ఉత్తరాఖండ్‌లో యమునానది పుట్టిన చోటైన యమునోత్రిలో. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలమైన (త్రివేణీ సంగమం) ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో. శ్రీకృష్ణుడు పుట్టిన ఊరైన మధురలో, ఆయన కంసుణ్ణి సంహరించిన తరువాత విశ్రమించాడని చెప్పే విశ్రామ్ ఘాట్‌లో. కేశి అనే రాక్షసుణ్ణి శ్రీకృష్ణుడు సంహరించిన ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన బృందావనంలోని కేశీ ఘాట్ దగ్గర. డెహ్రాడూన్ జిల్లాలోని డాక్ పత్తర్ ఘాట్‌లో. ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్, వజీరాబాద్ తదితర ఘాట్లలో. ఆగ్రాలోని దసరా ఘాట్, కైలాస్ ఘాట్ తదితర ప్రదేశాల్లో.

# తెలుసుకోవాల్సింది అదే!

నేను ఎవరు? ఎక్కడినుంచి వచ్చాను? ఈ భూమి మీద మానవుడిగా ఎందుకు జన్మించాను? ఈ మానవ జన్మ పరమార్థం ఏమిటి? ఈ జన్మ ముగిసిన తరువాత నా పయనం ఎటువైపు?... సత్యాన్వేషకులు చాలామంది ఆలోచనల్లో ఈ ప్రశ్నలు తరచుగా మెదులుతూ ఉంటాయి. మనల్ని మనం తెలుసుకుంటే వీటికి సమాధానం లభిస్తుందంటూ ఎందరో మహానుభావులు మార్గాన్ని చూపించారు."నీవు కేవలం ఆత్మవు. శరీరానివో, బుద్ధివో, అహంకారానివో కాదు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు స్పష్టంగా తెలియజేశాడు. ఆది శంకరులు "నీవు ఆత్మవు" అంటూ సంపూర్ణ వివరణ ఇచ్చారు. "దేవుణ్ణి తెలుసుకోవడానికి ముందు నిన్ను నువ్వు తెలుసుకో" అని గౌతమ బుద్ధుడు, మహావీరుడు కూడా చెప్పారు. ఆది గురువైన దత్తాత్రేయుడు పది అవతారాల ద్వారా 'నీవు ఎవరు?' అనేది తెలియజేసే ప్రయత్నం చేశాడు. ఏసు క్రీస్తు కూడా "నో దై సెల్ఫ్" అన్నాడు. "నిన్ను నువ్వు తెలుసుకోవాలి" అని దాని అర్థం. మహమ్మద్ ప్రవక్త, గురునానక్, కబీర్ దాసు, వేమన, రమణ మహర్షి... ఇలా అనేకమంది గురువులు ఇదే చెబుతూ వచ్చారు. మనలోని ఆత్మను ఎలా తెలుసుకోవాలో, పరమాత్ముడితో ఎలా అనుసంధానం కావాలో వివిధ మార్గాల ద్వారా బోధించి, మానవాళిని ముందుకు నడిపించడానికి పాటుపడ్డారు. కాగా. పై ప్రశ్నలకు సమాధానాన్ని తెలుసుకొనే ఒక విధానాన్ని సహజయోగ రూపంలో మానవాళికి శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రసాదించారు. దాని ద్వారా మనలో ఉన్న ఆత్మ, సూక్ష్మ శరీరాల ఉనికిని గుర్తించవచ్చు, అనుభూతిపరంగా వాటిని తెలుసుకోవచ్చు. లోకాన్ని సంక్షుభితం చేస్తున్న కల్లోలాల నుంచి, అశాంతి నుంచి వ్యాధుల నుంచి రక్షణ పొందడం కోసం... మనలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసుకోవాలి. ఆత్మను ప్రకాశవంతం చేసుకోవాలి. స్వీయ అనుభవం ద్వారా మనలోని సూక్ష్మ శరీరాన్ని అవగాహన చేసుకోవాలి. దీనికి దోహదపడే మహా యోగం... సహజయోగ. దాని అభ్యాసం ద్వారా మనల్ని మనం తెలుసుకొనే ప్రయత్నం చేస్తే... ఆత్మ సాక్షాత్కారం సిద్ధిస్తుంది. మన ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి.

# లోకాభిరామం శ్రీరామం

శ్రీమహావిష్ణువు అవతారాల్లో అత్యంత విశిష్టమైనది శ్రీరామావతారం. ఆయన ఆదికావ్యమైన రామాయణ కథానాయకుడు. ధర్మనిష్ట, సత్యసంధత అనే ఆదర్శాలకు ప్రతిరూపం. రామాలయం లేని గ్రామంలో ఒక్క రాత్రి కూడా నిద్రించకూడదన్నారు పూర్వులు. సామాన్యంగా ఆలయాల్లో శ్రీరాముడు విడిగా కనిపించడం అరుదు. ధర్మపత్ని అయిన సీత, సోదరుడు లక్ష్మణుడు, సేవకుడైన హనుమంతుడు, కొన్నిసార్లు మరో ఇద్దరు సోదరులు భరత, శత్రుఘ్నులతో కలిసి దర్శనమిస్తాడు. శ్రీరాముని రూపాలు మూడు విధాలుగా ఉంటాయి. అవి: స్థిత (నిలబడిన) రూపం. ఆసీన (కూర్చున్న) రూపం. శయన (పవళించిన) రూపం. స్థితరూపం: 'పాంచరాత్రాగమం', 'పాద్మ సంహిత' ప్రకారం నిలబడిన శ్రీరాముడు మూడు వంపులున్న శ్యామల వర్ణ దేహంతో, రెండు చేతులతో ఉంటాడు. కిరీటం, శ్రీవత్సం లాంటి అలంకారాలతో, ప్రసన్నవదనంతో, కుడిచేతిలో బాణాన్ని, ఎడమ చేతిలో ధనుస్సును ధరించి ఉంటాడు. కొన్ని ఆలయాలలో నాలుగు చేతులతో... కుడి పరహస్తంలో చక్రం, ఎడమ పరహస్తంలో శంఖం ధరించి ఉంటాడు. శ్రీరాముని దివ్యరూపం 33 శుభ లక్షణాలను కలిగి ఉంటుంది. శిల్ప ఆగమ శాస్త్రాలను అనుసరించి శ్రీరాముని ప్రతిమ మధ్యమ దశతాళమానం ప్రకారం 120 అంగుళాలకన్నా ఎక్కువ ఎత్తులో ఉండకూడదు. ఆ మూర్తి త్రిభంగిలో ఉన్న స్థానక మూర్తి. ఎర్రని వస్త్రాలు ధరించిన, నల్లని రూపం కలిగిన మూర్తి. రామునికి కుడివైపున నవార్ధ (తొమ్మిదిన్నర) తాళమానంలో చేసిన సీతా ప్రతిమ ఉండాలి. సీతాదేవి సమభంగిలో ఉండి, రాముని భుజాల ఎత్తు వరకూ ఉండాలి. రాముని తల మీద కిరీట మకుటం, సీత తలమీద కరండ మకుటం ఉండాలి. సీతాదేవి తన ఎడమ చేతిలో నీలోత్పలాన్ని ధరించి, కుడి చేతిని జారవిడిచినట్టు చూపించాలి. రామునికి ఎడమవైపున... 116 అంగుళాలకు మించని లక్ష్మణుని ప్రతిమ ఉండాలి. లక్ష్మణుడు రాముని భుజాల వరకు లేదా చెవుల వరకు... పసుపు పచ్చని మేని ఛాయతో, అన్ని విధాలా రాముణ్ణి పోలి, ధనుర్బాణాలు ధరించి ఉంటాడు. రామునికి ఎదురుగా... కాస్త కుడివైపున, 84 అంగుళాలకు మించని హనుమంతుడు ఉంటాడు. ఒక చేతిని నోటి మీద, వేరొక చేతిని జారవిడిచినట్టు చూపాలి. 'విష్ణుధర్మోత్తర పురాణం' ప్రకారం భరత, శత్రుఘ్నుల ప్రతిమలు కూడా ఉండాలి. ఆసీన రూపం: రెండు చేతులు కలిగిన రాముని విగ్రహం ఆసీన భంగిమలో ఉన్నప్పుడు... ధనుర్బాణాలతో ఉండదు. ఈ రూపంలో శ్రీరాముడు కుడి, ఎడమ చేతులు అభయ, వరద ముద్రలతో ఉంటాయి. రామునికి ఎడమవైపున సీతాదేవి సుఖాసీనురాలై ఉంటుంది. ఎడమవైపున లక్ష్మణుడు అంజలీ బద్ధుడై ఉంటాడు. భద్రాచల దివ్య క్షేత్రంలో శ్రీవైకుంఠ రామచంద్రమూర్తి ఆసీన రూపంలో దర్శనమిస్తాడు. కుంభకోణంలోని రామర్ కోయిల్‌లో కూడా కూర్చున్న రాముణ్ణి దర్శించుకోవచ్చు. శయనరూపం: శ్రీరాముడు శయన భంగిమలో ఉన్నప్పుడు... ఆయన కిరీటం దగ్గర సీతాదేవి సుఖాసీన స్థితిలో ఉంటుంది. లక్ష్మణుడు తదితరులు అంజలీబద్ధులైనట్టు, హనుమంతుడు యానాసనంలో లేదా శరాసనంలో ఉన్నట్టు రూపొందించాలని శాస్త్రాలు పేర్కొన్నాయి. తిరువల్లూరులోని శ్రీవీరరాఘవస్వామిని, కుంభకోణంలోని శ్రీసారంగపాణి పెరుమాళ్‌ను శయనించి ఉన్న శ్రీరాముని ప్రతిమలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కేవల శ్రీరాముడు: 'పాద్మసంహిత' ప్రకారం... రాముని విగ్రహం ఒక్కటే ప్రతిష్ఠించాల్సి వస్తే.. స్వామిని గర్భగుడి మధ్యభాగమైన బ్రహ్మభాగంలో ప్రతిష్ఠించాలి. స్వామి నిలబడి ఉంటే...ధనస్సును, బాణాలను పట్టుకొని ఉన్నట్టు రూపొందించాలి. అయోధ్యలో బాలరాముణ్ణి ఆ విధంగానే రూపొందించి, ప్రతిష్ఠించారు.



# మూడు శక్తులు



దైవం ఎల్లప్పుడూ, అంతటా ఉంటాడు అనేది అన్ని విశ్వాసాలకు మూలాధారం. అయితే ఒక్కొక్క ధర్మానికి తనదైన ప్రత్యేక పంథా ఉంటుంది. క్రైస్తవ విశ్వాసం ప్రకారం దేవుడు ఎప్పుడూ మానవుల వెన్నంటే ఉంటాడు. అవసరమైనప్పుడు సంభాషిస్తాడు. చెప్పదలచినది చెప్పి, నడిపిస్తాడు. "నేను నీతోనే వస్తూ ఉంటాను. నిను విడువను, ఎడబాయను' అంటాడు. "గడ్డి ఎండిపోతుంది. పువ్వు వాడిపోతుంది. దేవుని వాక్యం నిత్యం మనతోనే ఉంటుంది" అని యెషయా చెబుతాడు. ఇది లోకానికి తండ్రి అయిన దేవునికి సంబంధించిన విషయం.క్రీస్తుకు 'ఇమ్మానుయేలు' అనే పేరు ఉంది. 'దేవుడు ఎల్లప్పుడూ మనకు తోడై ఉంటాడు' అని దాని అర్థం. భూమిపై జీవించి, మరణం తరువాత కూడా నలభై రోజులు తన వారితో ఉండి, మోక్షానికి పయనమవుతూ "ఇదిగో! నేను యుగ సమాప్తివరకూ ఎల్లకాలము మీతో ఉంటాను" అని వారితో చెప్పాడు ఏసుక్రీస్తు. "ఆకాశం, భూమి గతించిపోతాయి కానీ నా మాటలు ఎన్నడూ గతించవు" అని ప్రభువు చెప్పినట్టు ముగ్గురు సువార్తికులు పేర్కొన్నారు. దైవానికి బైబిల్‌లో 'వాగ్రూపుడు' అనే ఇంకో పేరు ఉంది. అంటే మాట రూపంలో ఆయన ఉన్నాడు. ఇవన్నీ గమనించినప్పుడు... 'దేవుడు మనిషిని ఒంటరిగా విడిచి పోలేదు. వెంటే ఉండి నడిపించాడు, నడిపిస్తున్నాడు' అని బైబిల్ గ్రంథాన్ని బట్టి, దాని వ్యాఖ్యానాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ సృష్టికి రూపకల్పన చేసిన దేవుడు... ఆ సృష్టి భ్రష్టమైపోతున్న దశలో... తన కుమారుడు క్రీస్తును ఈ లోకానికి పంపించాడు. క్రీస్తు లోకులకు బోధలు చేశాడు. అందరికోసం మరణించాడు. మరణం నుంచి తిరిగి లేచాడు. తిరిగి మోక్షానికి వెళ్ళాడు. మరి ఆ తరువాత... ఈ లోకానికి దిశా నిర్దేశం చేసేవారు ఎవరు? "దైవం మీకు తోడు వస్తాడు. మిమ్మల్ని నడిపిస్తాడు" అని ప్రభువు చెప్పిన ప్రకారమే... అగ్ని శిఖలతో పవిత్రాత్మ వచ్చి, శిష్యుల తలలపై చేరింది. ఆ పవిత్రాత్మే ఈ లోకాన్ని నడిపిస్తోందనేది విశ్వాసుల నమ్మకం. సమస్త లోకానికి తండ్రి అయిన దైవం, ఆయన ప్రియ పుత్రుడైన క్రీస్తు, పవిత్రాత్మ... విడివిడిగా ఉంటూనే, ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉండే మూడు శక్తులు. క్రీస్తు మళ్ళీ వస్తాడనీ, అప్పటివరకూ ఈ పవిత్రాత్మ తన బోధనను శిష్యులద్వారా కొనసాగిస్తూ ఉంటుందని క్రైస్తవుల విశ్వాసం.

# 'సర్'కు సరే...!

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఎన్నికల సంఘానికి కొత్తశక్తిని ఇస్తుంది. పదహారు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోవిడత 'సర్'కు ఉపక్రమిస్తున్న తరుణంలో, జాబితాల ప్రక్షాళన విషయంలో ఎన్నికల సంఘానికి ఈ తీర్పు సర్వాధికారాలనూ దఖలుపరిచింది. ఈ ప్రక్రియను సమర్థిస్తూ వస్తున్న భారతీయ జనతాపార్టీకి ఇది సంతోషాన్నిస్తే, వ్యతిరేకించి వీధిపోరాటాలు చేసిన విపక్షాలకు పెద్ద ఎదురుదెబ్బ. బిహార్‌లో చేపట్టిన 'సర్' భేషుగ్గా ఉందని కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో ఇక దేశవ్యాప్తంగా ఆ పథకాన్ని అమలు చేయడంలో ఈసీకి ఏ అడ్డంకులూ ఉండబోవు. 'సర్' రాజ్యాంగబద్ధం, దానిని నిర్వహించే హక్కు, అధికారం ఈసీకి ఉన్నాయి, అది ఏ చట్టాలనూ అతిక్రమించలేదు, రాష్ట్రాల్లో 'సర్' నిర్వహణ ఆవశ్యకత ఉందన్న ఈసీ వాదన సమర్థనీయం, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాలన్న రాజ్యాంగ ఆదేశాలను, ఆకాంక్షలను సర్ నెరవేరుస్తుంది అంటూ చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం తమ నూటపాతిక పేజీల తీర్పులో నిర్ధారించింది. ఏటా జరిగే ఓటర్ జాబితా సవరణకంటే సర్ భిన్నంగా ఉన్నంతమాత్రాన దానిని వద్దనలేమని, మొదట్లో ఎక్కువమంది ఓటర్లను తొలగించినట్టుగా సర్ కనిపిస్తుంది కానీ, తగిన రక్షణచర్యలతో దీనిని రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చునని కోర్టు వ్యాఖ్యానించింది. ఆధార్, ఓటరు కార్డు తిరస్కరణ సహా అర్హత పత్రాల నిర్ణయంలో ఈసీ అధికారాలను కోర్టు పూర్తిగా సమర్థించడం విశేషం. ఎన్నికల సంఘానికి ఏవో కొన్ని నామమాత్రపు సలహాలు, సూచనలు మినహాయిస్తే, సుప్రీంకోర్టు ఈ తీర్పుతో సర్‌కు ప్రాథమికంగా చట్టబద్ధత కల్పించింది. ఓటరు జాబితాలో పేరు లేనంతమాత్రాన పౌరసత్వం కోల్పోయినట్టు కాదని కూడా ఓ భరోసా ఇచ్చింది. దేశ పౌరులు కాదన్న అనుమానంతో రెండుదశాబ్దాల నాటి ఆ జాబితాలనుంచి తొలగించిన వ్యక్తులపేర్లను నాలుగువారాల్లోగా పౌరసత్వాన్ని నిర్ధారించే యంత్రాంగానికి పంపించాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ఓటరు జాబితాలో తీసివేతలు, చేరికలను నిర్ణయించే పరిధి మాత్రమే ఎన్నికల సంఘానిది కానీ, పౌరసత్వాన్ని మాత్రం అది నిర్ధారించలేదన్నది దీని సారాంశం. 'సర్' పేరిట పెరటిదోవన 'ఎన్ఆర్‌సి' అమలు అవుతోందన్న విమర్శలు, అనుమానాల నేపథ్యంలో కోర్టు ఈ జాగ్రత్త తీసుకున్నట్టు ఉంది. మరోవిధంగా చెప్పుకోవాలంటే, తనకు నచ్చినవాటిని మాత్రమే అర్హతపత్రాలుగా నిర్ణయించి, వాటి ఆధారంగా ఈ దేశ పౌరులు కాదన్న అనుమానంతో లక్షలాదిఓట్లను తొలగించడం వరకూ ఎన్నికల సంఘం ప్రక్రియ సరైనదే. కానీ, పౌరసత్వ నిర్ధారణ అధికారం మాత్రం దానికి లేదు కనుక, ఆ పని వేరే చోట జరిగి, ఒకవేళ సదరు అథారిటీ వీరిలో కొందరు ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించిన పక్షంలో, ఆ పేర్లు తిరిగి జాబితాలో చేరుతాయన్నమాట. వినడానికి ఎంతో బాగున్న ఈ ఆ దేశం ఆచరణలో కాగితాలమీద ఎంతకాలం మిగిలిపోతుందో చూడాలి.స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది వంటి మాటలు వినడానికి ఎంతో బాగుంటాయి. కానీ, ఆచరణలో ఓటరు జాబితాలనుంచి లక్షలసంఖ్యలో మాయమైపోయిన పేర్లు ఎవరివో, ఎందుకో అందరికీ తెలుసు. బిహార్‌లో నలభై లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 90లక్షల ఓట్లు ఒక్కవేటున తొలగిపోయి, ఆ తరువాత సుప్రీంకోర్టు అడపాదడపా ఇచ్చిన సూచనల మేరకు నామమాత్రంగా సాగిన ట్రిబ్యునల్స్ తరహా పరిష్కారాలతో వందల సంఖ్యలో మాత్రమే పేర్లు తిరిగి చేరిన విషయం తెలిసిందే. ముఖ్యంగా, బిహార్, బెంగాల్‌లో విపక్షపార్టీలకు ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం ఓటర్ల ఏరివేతే లక్ష్యంగా ఇది సాగిందన్నది ప్రధానమైన విమర్శ. కనీసం రెండుదశాబ్దాలుగా ఏ జాబితాలైతే అనేక రాష్ట్రాల్లో పాలకులను, కేంద్రంలో మూడుసార్లు ఇదే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నాయో, వాటికి మకిల వదిలించి ప్రక్షాళించే పేరిట లక్షలమంది నిరక్షరాస్యులు, నిరుపేదలను ఓటుహక్కుకు దూరం చేయడం గురించి కోర్టు సహజంగానే మాట్లాడలేదు. 'సర్' రాజ్యాంగబద్ధత గురించి కోర్టు ఏమి చెప్పబోతున్నదో దానికి వ్యతిరేకంగా పిటిషన్లు వేసిన వారికి కూడా అనుమానం ఉండివుండదు. కానీ, ఆచరణలో అత్యంత హడావుడిగా, అన్యాయంగా సాగిన ఈ ప్రక్రియ వెనుక ఉన్న దురుద్దేశాల గురించే వారి బాధంతా.




# మైక్రో డ్రామా... భారత్ లో బలపడుతున్న ట్రెండ్ ఇదే!

**భారత్‌లో దూసుకొస్తున్న కొత్త వినోద రూపం 'మైక్రో డ్రామాలు'**

**జియోస్టార్, అమెజాన్ వంటి ఓటీటీలు ఈ ఫార్మాట్‌ను అందిస్తున్నాయి**

**తక్కువ నిడివితో మొబైల్ యూజర్లను ఆకట్టుకోవడమే లక్ష్యం**

**2028 నాటికి రూ. 23 బిలియన్ల మార్కెట్‌గా ఎదుగుతుందని అంచనా**

భారత వినోద రంగంలో సరికొత్త ట్రెండ్ మొదలైంది. ప్రేక్షకుల దృష్టిని ఆకట్టుకోవడానికి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు "మైక్రో డ్రామా"ల పేరుతో ఒక కొత్త ఫార్మాట్‌ను దూకుడుగా ప్రవేశపెడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ తెరలకు అతుక్కుపోతున్న నేటి తరాన్ని లక్ష్యంగా చేసుకుని, ఒకటి నుంచి మూడు నిమిషాల నిడివితో ఉండే చిన్న చిన్న ఎపిసోడ్లతో ఈ మినీ సీరియళ్లను రూపొందిస్తున్నాయి. ఈ మార్పులో భాగంగా, జియోస్టార్ తన జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌లో 'తడ్కా' పేరుతో ఏప్రిల్ 2026లోనే 100కు పైగా మైక్రో డ్రామా టైటిళ్లను అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు అమెజాన్ కూడా ఎంఎక్స్ ప్లేయర్‌లో 'ఫటాఫట్' పేరుతో ఇలాంటి ఫార్మాట్‌ను ప్రవేశపెట్టింది. వీటితో పాటు కుకు టీవీ, స్టోరీ టీవీ వంటి ప్రత్యేక యాప్‌లు కూడా వేగంగా ఆదరణ పొందుతున్నాయి. భారతీయులు 2025లో తమ ఫోన్లపై 1.2 ట్రిలియన్ గంటలు గడిపారన్న అంచనాలే ఈ కొత్త ట్రెండ్‌కు ప్రధాన కారణం. దేశంలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల సంఖ్య 584 మిలియన్లకు చేరగా, 2028 నాటికి ఇది 670 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. ప్రయాణాల్లో, చిన్న విరామ సమయాల్లో రీల్స్, షార్ట్స్ చూసే అలవాటు ఉన్న ప్రేక్షకులను ఆకర్షించేందుకు ఈ మైక్రో డ్రామాలు దోహదపడతాయి. ఈ మైక్రో డ్రామాలను కేవలం వినోదం కోసమే కాకుండా, తక్కువ ఖర్చుతో కొత్త కథలను, పాత్రలను పరీక్షించడానికి ఓటీటీలు ఒక 'ప్రయోగశాల'గా చూస్తున్నాయి. వీటిలో విజయవంతమైన వాటిని పూర్తిస్థాయి సిరీస్‌లుగా మార్చే అవకాశం ఉంది. ఈ రంగం 2028 నాటికి సుమారు 275 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సృష్టించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద, రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ వంటి వాటితో పోటీ పడుతూ, ప్రేక్షకులను తమ ప్లాట్‌ఫామ్‌లలోనే ఉంచడానికి స్ట్రీమింగ్ సంస్థలు వేస్తున్న సరికొత్త ఎత్తుగడ ఈ మైక్రో డ్రామాలు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com